గురువారం
25-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 65
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

స్థాపితం 1952 విశాలాంధ్ర 70

దేవదాయశాఖకు

సలహాదారా?

- ఇలాగే వదిలేస్తే రేపు ఏజీకి కూడా ఒకర్ని నియమిస్తారు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- జీవో పై స్టే విధిస్తూ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జగన్ సర్కార్‌కు హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. దేశ చరిత్రలో మున్నెన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో సలహాదారులను నియమిస్తూ రాజకీయ నిరుద్యోగులకు దీనినొక ఒక ఉపాధి కేంద్రంగా మార్చారు. తొలుత ముఖ్యమంత్రికి సలహాదారులను నియమించిన ప్రభుత్వం, అనంతరం ప్రభుత్వ వ్యవహారాలకు సలహాదారులను నియమించింది. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ శాఖలకు సలహాదారులను నియమిస్తోంది. ఇదే క్రమంలో దేవదాయ శాఖకు ఇటీవల జె.శ్రీకాంత్‌ను సలహాదారుగా రాష్ట్ర ప్రభుత్వం నియామకం చేసింది. దీంతో శ్రీకాంత్‌ను దేవదాయ శాఖ సలహాదారుగా నియమించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇది నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ సోమయాజులతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ సంఖ్యలో నియమిస్తున్న సలహాదారుల

- మిగతా 2 లో

ఒక్కటవుదాం

విపక్షాల ఉమ్మడి రాజకీయ వ్యూహం

- ప్రత్యామ్నాయ రాజకీయ కూటమికి కసరత్తు
- ఐక్యవేదికగా సమ్మాన్ దివస్ ర్యాలీ
- హరియాణాలో సెప్టెంబరు 25న...

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయస్థాయిలో ప్రతిపక్షాలు, లౌకికపార్టీలు ఏకమవుతున్నాయి. బీజేపీ సైద్ధాంతిక వైఖరి, పార్లమెంటరీ, రాజ్యాంగ వ్యవస్థపై దాడి, ప్రభుత్వరంగాన్ని బడా కార్పొరేట్‌లకు అమ్ముతున్న తీరు, ప్రభుత్వ బ్యాంకులను లూటీ చేసి అదానీ, అంబానీ లాంటి పెట్టుబడిదారుల లక్షల కోట్ల రూపాయల అప్పులు మాఫీ చేసిన వైనం, ప్రజలపై మోపుతున్న భారాలు, నిరుద్యోగం, రూపాయి పతనం, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలపై దురాగతాలకు వ్యతిరేకంగా ఐక్యపోరునకు 2024 ఎన్నికలే లక్ష్యంగా ఉమ్మడి అజెండాతో ఐక్య రాజకీయ వ్యూహంతో విపక్షాలు ముందుకు సాగుతున్నాయి. ఇందుకోసం సెప్టెంబరులో హరియాణాలో జరగబోయే ర్యాలీ వేదిక కాబోతోంది. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ) నాయకుడు ఓం ప్రకాశ్ చౌతాలా నేతృత్వంలో ఫతేబాద్‌లో సెప్టెంబరు 25న దేవీలాల్ జయంతి సందర్భంగా నిర్వహించే సమ్మాన్ దివస్ ర్యాలీ కోసం కీలక ప్రతిపక్షాలతో పాటు బీజేపీ మాజీ మిత్రపక్షాలకు ఆహ్వానం వెళ్లింది. హరియాణాతో పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాషాయ పార్టీకి వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటుకు ఐఎన్ఎల్‌డీ నడుం బిగించింది. ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఈ ర్యాలీని మాధ్యమంగా చేసుకుంది. జనతా దళ్ (యునైటెడ్), బీహార్ సీఎం నితీశ్ కుమార్, రాష్ట్రీయ జనతా దళ్ నేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్, బీహార్ సీనియర్ నేత కేసీ త్యాగి, శిరోమణి అకాలీ దళ్ (బాదల్) నేత, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్, సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా ర్యాలీకి హాజరుకానున్నారు. జాతీయ- రాష్ట్రాల స్థాయిలోనూ బీజేపీతో ప్రాంతీయ పార్టీలు తెగతెంపులు చేసుకుంటున్న సమయంలో ఇటువంటి బృహత్కర కార్యాన్ని చేపడుతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఇటీవల ఎన్డీయేతో జేడీ(యూ) తెగతెంపులు చేసుకుంది. తాజా పరిణామాలపై జేడీ(యూ) అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ 'ది వైర్'తో మాట్లాడారు. బీహార్‌లో జనతా దళ్ ఆవిర్భావానికి ఎంతగానో కృషి చేసిన దేవీలాల్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తుండటంతో దీనికి తమ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నితీశ్ కుమార్, దేవీలాల్ కలిసి జనతాదళ్‌లో పనిచేశారని తెలిపారు. 1985లో బీహార్ ఎమ్మెల్యేగా జనతా దళ్ నుంచి నితీశ్ కుమార్ మొదటిసారి ఎన్నికయ్యారు. దేవీలాల్ 1989లో వీపీ సింగ్ నేతృత్వ జనతా దళ్ ప్రభుత్వంలో ఉపప్రధానిగా పనిచేశారు. బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటుకు ఇతర ప్రాంతీయ, జాతీయ పార్టీలతో చర్చలు జరుపుతామని తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ ఇటీవల ప్రకటించడాన్ని జేడీ(యూ) నేత గుర్తుచేశారు. వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలతో నితీశ్ కుమార్ స్వయంగా మంతనాలు జరుపుతారని రంజన్ ప్రకటించినట్లు తెలిపారు. బీజేపీని సాధ్యమైనంత మేరకు కట్టడి చేయాలన్నది జేడీ(యూ) లక్ష్యమని ఆ పార్టీ అధికార ప్రతినిధి వెల్లడించారు. ప్రత్యామ్నాయ రాజకీయాలకు ప్రయత్నించి, 2024లో బీజేపీని ఓడించే స్పష్టమైన లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. తమది బీజేపీ వ్యతిరేక అజెండానేగానీ కాంగ్రెస్ వ్యతిరేక వైఖరి కాదన్నారు. దేశం పెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, 2024లో తీవ్ర సవాళ్లను

- మిగతా 2 లో

మార్క్సిస్టు మేధావి చంద్రం



స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు సాహిత్యానికి, జర్నలిజానికి మార్క్సిస్టు దృక్పథాన్ని కల్పించిన దార్శనికుడు మద్దుకూరి చంద్రశేఖర రావు ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమానికి బలమైన పునాదులు వేశారు. మనం ఆప్యాయంగా పిలుచుకునే చంద్రం గారు కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలో 1907లో జన్మించారు. బందరు హిందూ హైస్కూలులో చదివారు. తర్వాత జాతీయ కళాశాలలో చేరారు. విద్యార్థి దశలో జాతీయోద్యమంలో పాల్గొని దాని నుంచి కమ్యూనిస్టు ఉద్యమానికి వచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థిగా 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లారు. 1932లో వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొన్న సందర్భంలో పోలీసులు ఆయనను చిత్రహింసలు పెట్టారు. రెండేళ్ల కఠిన జైలు శిక్ష విధించారు. జైలులోనే మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేసి అవగాహన చేసుకున్నారు. తన పంథా నిర్ధారించుకున్నారు. తనతోపాటు అనేక మంది యువకులను సమీకరించి పార్టీకి సుశిక్షితులైన సైనికుల్లా మార్చారు. పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావుతో కలిసి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి నిర్విరామ కృషి చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేయడంతోపాటు ఓ మేధావిగా శైశవ దశలో కమ్యూనిస్టు పార్టీకి మార్గదర్శకం చేశారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, మాతృదేశ దాస్య విముక్తి ఉద్యమాన్ని సమన్వయం చేసి పార్టీని నడిపించడంలో ఆయన చూపిన మార్గం దిక్సూచిలా నిలిచింది. సోవియట్ యూనియన్‌పై నాజీల దాడి నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న వైఖరికి వ్యతిరేకత వచ్చింది. అప్పుడు ఆంధ్ర కమ్యూనిస్టులు ఆయన నాయకత్వాన సంయమనంతో ముందుకు సాగారు. రాసిన వ్యాసాలు 'గాంధీ-ఇర్విన్ ఒడంబడిక నాటినుంచి జమీందారీ పోరాటం వరకు' కాంగ్రెస్ నిర్వహించిన రాజకీయాలు ఏమిటో అర్థమవుతాయి. ఒక దశలో కమ్యూనిస్టు పార్టీపై వచ్చిన కువిమర్శలను తిప్పికొట్టడంలో ఆయన తన వ్యాసాలను ఆయుధాలుగా ఎక్కుపెట్టారు.

మద్దుకూరి చంద్రశేఖరరావు పాత్రికేయ జీవితం 1937లో కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించిన పత్రిక నవశక్తి సంపాదకునిగా ప్రారంభమైంది. పార్టీ రహస్యపత్రిక స్వతంత్ర భారత్, 1942-45 మధ్య ప్రజాశక్తి వారపత్రికకు, 1946నుంచి 1948 నిర్బంధ కాలంలో మూసివేసే వరకు ప్రజాశక్తి దినపత్రిక సంపాదకులుగా పనిచేశారు. 1948లో అరెస్టు అయ్యారు. 1952లో విశాలాంధ్ర దినపత్రిక ప్రారంభంలో ప్రధాన సంపాదకునిగా వ్యవహరించారు. 1964నుంచి 68 వరకు సంపాదకవర్గంలో ఒకరిగా ఉన్నారు. ప్రగతి సచిత్రవారపత్రికకు 1969 నుండి 1974 వరకు ప్రధాన సంపాదకునిగా వ్యవహరించారు. జయభారత్, రెడ్ అనే రహస్య పత్రికలు ఆయన నాయకత్వంలో నడిచాయి. ఆయన పత్రికారచన ఎంతో సులువుగా, సూటిగా, సరళంగా పల్లె ప్రజలను లక్ష్యంగా చేసుకొని సాగింది.

మద్రాసు నుంచి విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు కమ్యూనిస్టు పార్టీ ఆయన నాయకత్వంలో గొప్ప పోరాటం చేసింది. నాగరికత, చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేక శ్రద్ధ తీసుకొనడానికి ఆయన చొరవే ప్రధాన కారణం. సోషలిస్టు భావాలను, మార్క్సిస్టు సిద్ధాంతాలను ప్రజల్లో ప్రచారం చేయడానికి, ప్రజల సమస్యలు వెలుగులోకి తెచ్చి, వాటి పరిష్కారానికి సాగే ఉద్యమాలకు ఊతంగా నిలవడానికి పత్రికల ద్వారా చంద్రం కృషి చేశారు. కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికి, ప్రజాతంత్రశక్తుల సమీకరణకు తన వ్యాసాలు, సంపాదకీయాల ద్వారా తపించారు. 1951నుంచి 56వరకు రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. ఆయన ఏనాడు పదవుల్ని ఆశించలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పదవుల కన్నా పార్టీ నిర్మాణమే ముఖ్యమని నమ్మినవారు.

లేపాక్షి భూములు రైతులకు అప్పగించాలి

కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శ్రీసత్యసాయి జిల్లాలో వేల కోట్ల విలువైన లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను తిరిగి రైతులకు అప్పగించాలని, ఆ భూములను తనఖాపెట్టి బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పు చెల్లించకుండా దివాలా పేరుతో కుట్ర చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు చెల్లించి, దాదాపు 10 వేల ఎకరాలు సేకరించిందని గుర్తుచేశారు. ఆయా భూముల్లో లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, వేలాది

- మిగతా 2 లో

మా సర్కారు కూల్చివేతకు

ప్రధాని కుట్ర

- 'ఆప్' విచ్ఛిన్నానికి లంచాలు ఎర
- ఇది తీవ్రమైన విషయం: కేజ్రీవాల్
- 'బీజేపీలో చేరండి లేదా సీబీఐ, ఈడీని ఎదుర్కోండి'
- కాషాయ పార్టీ బెదిరింపులు

2 లో

దిల్లీలో తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రధాని నరేంద్రమోదీ కుట్ర పన్నారని ఆప్ అధినేత, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఘాటుగా విమర్శించారు. ఇందుకోసం తమ పార్టీ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారని, కోట్లాది రూపాయలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని మండిపడ్డారు.

బల పరీక్ష నెగ్గిన

నితీశ్ ప్రభుత్వం

సభను బహిష్కరించిన బీజేపీ సభ్యులు

పాట్నా : బీహార్‌లో కొత్తగా ఏర్పాటయిన మహాకూటమి ప్రభుత్వం విశ్వాస పరీక్షలో సునాయాసంగా నెగ్గింది. బుధవారం రాష్ట్ర శాసనసభలో జరిగిన బల పరీక్షలో మూజువాణీ ఓటుతో నితీశ్ కుమార్ గెలుపొందారు. అయితే విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా నితీశ్ ప్రసంగిస్తున్న సమయంలో నిరసనగా బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇక నితీశ్ ప్రభుత్వం బల పరీక్షకు ముందు స్పీకర్ పదవికి బీజేపీ నేత విజయ్ కుమార్ సిన్హా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి అభ్యర్థన మేరకు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న జేడీయూ నేత

- మిగతా 2 లో

డీఎస్సీ అభ్యర్థులకు

నిరాశ

పోస్టులు తక్కువ... పోటీ ఎక్కువ

- 502 ఖాళీలపై ఆగ్రహం
- మూడేళ్లుగా కానరాని ఉపాధ్యాయ నియామకాలు
- లక్షలాది మంది నిరుద్యోగులు లబోదిబో
- వయోపరిమితి పెంపుపై జగన్ సర్కారు నిర్లక్ష్యం
- ఉద్యమానికి అభ్యర్థులు సన్నద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ ప్రభుత్వం జంబో డీఎస్సీ ఇస్తుందంటూ మూడేళ్లగా ఎదురు చూస్తున్న అభ్యర్థులకు నిరాశే మిగిలింది. మూడేళ్ల తర్వాత అత్తెసరుగా పరిమితి డీఎస్సీ పేరుతో, 502 ఉపాధ్యాయ పోస్టులతోనే ప్రకటన జారీజేసి చేతులు దులుపుకుంది. అసలు ఇవి బ్యాక్‌లాగ్ పోస్టులా?, జనరల్ డీఎస్సీనా? అనేదీ విద్యాశాఖ ప్రకటనలో స్పష్టం చేయలేదు. కేవలం పరిమిత డీఎస్సీ పేరుతో ఉత్తర్వులు జారీ చేసింది. అతి తక్కువగా ఉన్న పోస్టులను చూసి, నిరుద్యోగులు లబోదిబోమంటున్నారు. గతంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1,2 ఉద్యోగాల ప్రకటనలోనూ మొక్కుబడిగా ప్రభుత్వం ప్రకటించి, అభాసుపాలైంది. మూడేళ్ల నుంచి డీఎస్సీ లేనందున జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్లకు ప్రభుత్వం నిర్ధారించడం వల్ల దాదాపు లక్షా 50 వేలకు పైగా అభ్యర్థులు అనర్హులుగా మారనున్నారు. డీఎస్సీలో అన్ని సబ్జెక్టుల వారీగా పోస్టులు పెంచాలని, జనరల్

- మిగతా 2 లో

అంబరాన్నంటిన ప్రచారం

- సీపీఐ రాష్ట్ర మహాసభలకు విస్తృత ఏర్పాట్లు
- విశాఖ చుట్టూ గోడరాతలు, ప్రతి ఇంటా కరపత్రాలు
- మారుమూల ప్రాంతాలకు గోడపత్రికలు

8 లో

ఐడీబీఐలో 51 శాతం వాటాల విక్రయం?

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఐడీబీఐ ప్రైవేటీకరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ వాటాదారులుగా ఉన్న ఈ బ్యాంక్‌లోని 51 శాతం వాటాలను అమ్మేశేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. యాజమాన్య హక్కులను సైతం బదిలీ చేయనున్నట్లు తెలిపాయి. దీనిపై ప్రభుత్వం, ఎల్ఐసీ చర్చలు జరుపుతున్నాయని చెప్పాయి. వాటాల విక్రయం తర్వాత కూడా కేంద్రం, ఎల్ఐసీ వద్ద వాటాలు ఉండనున్నాయి. మంత్రుల బృందం దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, సెప్టెంబర్ చివరి నాటికి కొనుగోలుదారుడిని ఎంపిక చేసే అవకాశం ఉందని తెలిసింది. ఐడీబీఐ బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వానికి 45.48 శాతం, ఎల్ఐసీకి 49.24 శాతం కలిపి మొత్తం 94 శాతానికి పైగా వాటా ఉంది. మెజార్టీ వాటాతో ఎల్ఐసీ ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్‌లో యాజమాన్య నియంత్రణ కలిగిన ప్రమోటర్‌గా ఉంది. ఐడీబీఐలో వ్యూహాత్మక వాటాలను విక్రయించేందుకు గతేడాది మే నెలలో కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా ఫైనాన్స్ యాక్ట్, 2021లో ప్రభుత్వం అందుకు అవసరమైన సవరణలు చేసింది. అయితే, ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ గురించి అనేకసార్లు వార్తలు వచ్చినప్పటికీ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో 51 శాతం వాటాను విక్రయించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ అంశంపై ఐడీబీఐ లేదా ఆర్థిక మంత్రిత్వ శాఖ లేదా ఎల్ఐసీగానీ స్పందించలేదని 'బ్లూమ్‌బెర్గ్' తెలిపింది.

వాగులో మునిగి

ముగ్గురి మృతి

విశాలాంధ్ర-పులివెందుల : స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకులు విగతజీవులైన విషాద ఘటన వైఎస్సార్ జిల్లా, పులివెందులలో చోటుచేసుకుంది. నామాలగుండు వాగులో సుడిగుండంలో చిక్కుకొని ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను ప్రొద్దుటూరు పట్టణం మోడంపల్లెకు చెందిన బాలశేఖర్ (19), నాని (21), తెల్లవాయువుల సంజీవ్ కుమార్ (30)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వీళ్లు ఓ వాహనంలో

- మిగతా 2 లో

300 వస్తువుల దిగుమతిపై శ్రీలంక నిషేధం!

కొలంబో : శ్రీలంక విదేశీ మారకద్రవ్య కొరత కారణంగా శ్రీలంక ప్రభుత్వం చాక్లెట్లు, పెర్ఫ్యూమ్స్, షాంపూలు తదితర 300 వస్తువుల దిగుమతిని నిషేధించింది. స్వాతంత్ర్యం సాధించిన అనంతరం తొలిసారిగా శ్రీలంక సంక్షోభంలో చిక్కుకుంది. ఫారెక్స్ నిల్వలు క్షీణించడంతో నిత్యావసర వస్తువులకు కొరత తీవ్రంగా ఏర్పడింది. దీనితో ప్రజలు భారీ నిరసన ప్రదర్శనలకు దిగడంతో రాజపక్స ప్రభుత్వం సైతం దిగిపోయింది. శ్రీలంక ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రత్యేక నోటిఫికేషన్‌లో చాక్లెట్లు, పెర్ఫ్యూమ్స్, మేకప్, షాంపూలతో అనేక రకాల ఉత్పత్తులు సహా మొత్తం 300 వస్తువుల దిగుమతిపై నిషేధం విధించినట్లు పేర్కొంది. ఆదేశాలు తక్షణం అమలులోకి వస్తాయని పేర్కొంది. ప్రస్తుతం శ్రీలంక అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎమ్ఎఫ్) బెయిల్ అవుట్ ప్యాకేజీ కోసం ఎదురు చూస్తోంది. లంక అధికారులు ఐఎంఎఫ్‌తో చర్చలు జరుపుతున్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ ప్యాకేజీ అందుబాటులోకి వస్తుందని శ్రీలంక సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ నందలాల్ వీరసింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు.



బాల్టిక్ దేశాలకు సిగ్గుచేటు

1990వ దశకం ప్రారంభంలో సోషలిజం పతనం తరువాత, బాల్టిక్ ప్రాంతంలోని మాజీ సోవియట్ రిపబ్లిక్‌లలో (లాట్వియా, ఎస్టోనియా, లిథువేనియా) బూర్జువా ప్రభుత్వాలు కమ్యూనిస్టు వ్యతిరేక, సోవియట్ వ్యతిరేక ప్రచారాలను సాగిస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీల కార్యకలాపాలు ఈ ప్రదేశాలలో పూర్తిగా నిషేధించడమైంది. ఇది ఆ దేశానికే సిగ్గుచేటని విశ్లేషకులు పేర్కొన్నారు. కమ్యూనిస్టు చిహ్నాలు, సోషలిస్టు స్మారక చిహ్నాలు ధ్వంసం చేశారు. లాట్వియా అధికారులు రెడ్ ఆర్మీకి అంకితం చేసిన 1985 స్మారక చిహ్నాన్ని కూల్చివేయాలని నిర్ణయించుకున్నారు. ఈ అవమానకరమైన చర్యకు సాకుగా లాట్వియా ప్రభుత్వం ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రను ఉపయోగించుకుంది! దీనికి మన మనస్సులో వచ్చే మొదటి ప్రశ్న: ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి సోవియట్ రెడ్ ఆర్మీకి ఏమి సంబంధం? సోవియట్ యూనియన్‌తో పెట్టుబడిదారీ రష్యాకు ఎలాంటి సంబంధం ఉంది? మేలో రష్యావార్షిక విక్టరీ డే సెలవుదినం, వారు ఎల్లప్పుడూ నాజీ జర్మనీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో మరణించిన సైనికుల జ్ఞాపకార్థం పువ్వులు వేయడానిక, కచేరీలను నిర్వహించడానికి స్మారక చిహ్నం ముందు సమావేశమవుతారు. స్మారక చిహ్నాన్ని కూల్చివేయడం ఈ చిహ్నం మద్దతు గ్రూప్ కో-చైర్ అయిన డిమిత్రి ప్రోకోపెంకోతో సహా చాలా మందిని కలవరపరిచింది. "లాట్వియా లాట్వియన్లు మరియు రష్యన్లు కలిసి నివసించే భూమి అని నేను అనుకుంటున్నాను" అని డిమిత్రి అన్నారు. "రిగా సగం లాట్వియన్, సగం రష్యన్, రాష్ట్రంలోని ఒక భాగం, దేశంలోని ఒక భాగం ఇతర భాగం యొక్క హక్కులను కూడా గౌరవించాలని నేను భావిస్తున్నాను.ఇదిలా ఉంటే ఎస్టోనియాలో...పొరుగున ఉన్న ఎస్టోనియా కమ్యూనిజం వ్యతిరేక చర్యలపై లాట్వియాతో పోటీపడుతుంది. గత వారం, తూర్పు సరిహద్దు పట్టణమైన నార్వేలో సోవియట్ కాలం నాటి స్మారక చిహ్నం కూల్చివేయడమైంది. ఇది 1934 సోవియట్ ట్యాంక్ యొక్క ప్రతిరూపం, ఇది రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీ నుండి ఎస్టోనియాను విముక్తి చేయడానికి తమ ప్రాణాలను అర్పించిన సోవియట్ సైనికుల జ్ఞాపకార్థంగా నిర్మించిన కట్టడం. నార్వాలో దాదాపు 57,500 మంది నివాసులు ప్రధానంగా రష్యన్ మాట్లాడేవారు. స్మారక చిహ్నాన్ని తరలించాలని పట్టణ కౌన్సిల్ సోమవారం నిర్ణయం తీసుకోవడం ఇప్పటికే తీవ్ర నిరసనలకు దారితీసింది.

మలేసియా మాజీ ప్రధానికి జైలు శిక్ష

మలేసియా : అవినీతి కేసులో మలేసియా మాజీ ప్రధాని నజీబ్ రజాక్‌ను దోషిగా తేలుస్తూ ఆ దేశ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది. దీంతో మాజీ ప్రధానుల్లో చెరసాలకు వెళ్తున్న తొలి వ్యక్తిగా నజీబ్ అప్రతిష్ఠ మూటగట్టుకోనున్నారు. దోషిగా నిర్ధారణ కావడంతో ఆయనకు హైకోర్టు గతంలోనే 12 ఏళ్ల కారాగార శిక్ష విధించింది. అధికార దుర్వినియోగం, నమ్మకద్రోహం, మనీ లాండరింగ్ నేరాలకు తగిన శిక్షగా పేర్కొంటూ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఐదుగురు సభ్యుల ఫెడరల్(సుప్రీం) కోర్టు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. తక్షణమే ఆయన జైలుజీవితం మొదలుపెట్టాలని ఆజ్ఞాపించింది. మలేసియా అభివృద్ధికి ఉద్దేశించిన 1 మలేసియా డెవలప్‌మెంట్ బెర్హాత్(1ఎండీబీ) నుంచి ఏకంగా 450 కోట్ల అమెరికన్ డాలర్లను నజీబ్ దోచుకున్నారని, 1ఎండీబీ విదేశీ విభాగమైన ఎస్ఆర్‌సీ ఇంటర్నేషనల్ నుంచి 94 లక్షల డాలర్లు అక్రమంగా పొందారని దర్యాప్తులో తేలింది. దేశ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి మైమన్‌ను ఈ కేసు విచారణ ప్యానెల్ నుంచి తప్పించాలంటూ నజీబ్ అంతకుముందు చేసిన అభ్యర్థననూ కోర్టు తిరస్కరించింది.

డీఎస్సీ అభ్యర్థులకు నిరాశ

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్ల నుంచి 47 ఏళ్లకు, రిజర్వేషన్ వర్గాలకు యథాతథంగా ఐదేళ్ల సడలింపు కల్పిస్తూ రివైజ్డ్ డీఎస్సీ ఇవ్వాలని అభ్యర్థులు ఉద్యమబాటకు సిద్ధమయ్యారు. ఇటీవల జరిగిన టెట్ పరీక్షకు 5.50 లక్షల మంది హాజరయ్యారు. ఇందులో టెట్ ఉత్తీర్ణులు, నూతనంగా రాసిన వారూ ఉన్నారు. గతంలో దాదాపు లక్షా 50 వేల మంది ఉత్తీర్ణత సాధించారు. డీఎస్సీ పోస్టుల కోసం మొత్తంగా 7 లక్షలకు పైగా అర్హతగల వారున్నారు. ప్రభుత్వం ప్రకటించిన 502 పోస్టులలో ఒక్కొక్క పోస్టుకు వేలాది మంది పోటీపడే పరిస్థితులున్నాయి. పోస్టులు తక్కువ... పోటీ ఎక్కువగా మారడంతో చాలా మంది అసలు దరఖాస్తు చేయడమే వృథా అనే భావనతో ఉన్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రకటించిన 502 పోస్టుల్లో ప్రభుత్వ జెడ్పీ, ఎంపీపీ పరిధిలో 13 ఉమ్మడి జిల్లాలకు కలిపి 199 పోస్టులు, మున్సిపల్‌లో 15 పోస్టులు, స్పెషల్ టీచర్లు (ఎస్ఏ) 81 పోస్టులున్నాయి. మోడల్ స్కూళ్లలో నాలుగు జోన్ల పరిధిలో పీజీటీ 176, టీజీటీ 31 కలిపి మొత్తంగా 207 పోస్టులున్నాయి.

ఆరు జిల్లాల్లో మున్సిపల్ జీరో పోస్టులు

విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని మున్సిపల్ పాఠశాలల్లో ఒక్క పోస్టు కూడా లేదు. మొత్తం 13 ఉమ్మడి జిల్లాలకుగాను మున్సిపల్ పాఠశాలల్లో కేవలం 15 పోస్టులే కేటాయించడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే, సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ), భాషా పండితులు-తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ, స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజెస్), టీజీటీ (లాంగ్వేజెస్), టీజీటీ (నాన్ లాంగ్వేజెస్), టీజీటీ (ఇంగ్లీష్, లాంగ్వేజెస్ ప్రొఫిషియెన్సీ), పీజీటీ (లాంగ్వేజెస్), పీజీటీ (నాన్ లాంగ్వేజెస్), పీజీటీ (ఇంగ్లీషు లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్), మ్యూజిక్, ఆర్ట్స్ విభాగాలున్నాయి. ఈ విభాగాలలో జిల్లాలు, విభాగాల వారీగా చూస్తే సరిపడా పోస్టులు లేవని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పేరుకే డీఎస్సీ ప్రకటించి, చేతులు దులుపుకుందని దుయ్యబడుతున్నారు. ఈ పోస్టుల భర్తీకి టెట్‌లో అర్హత సాధించిన వారంతా ఆయా సబ్జెక్టుల వారీగా అర్హులు. కంప్యూటర్ ఆధారితంగా పరీక్ష నిర్వహించి, డీఎస్సీ+టెట్‌లో వచ్చిన స్కోర్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

25 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలు

25 వేలకు పైగా వివిధ విభాగాల ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. వాటిని సత్వరమే భర్తీ చేయాలంటూ శాసన మండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు వివిధ సభ్యులు చాలా సార్లు ప్రస్తావించారు. మూడేళ్ల క్రితం ప్రభుత్వం 25 వేల ఖాళీలున్నట్లు వెల్లడించింది. జాతీయ విద్యావిధానం పేరుతో ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయ ఖాళీలు కుదించుకుపోయాయి. ఉన్న ఎస్జీటీలంతా ఉన్నత పాఠశాలలకు వెళ్లిపోయారు. ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడంతో ఖాళీలు ఏర్పడలేదు. ప్రభుత్వం అప్పులమయమైంది. ప్రతి ఏటా వివిధ సంస్థల నుంచి అప్పులు తెచ్చుకోవడంతో ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ తరుణంలో జంబో డీఎస్సీ ఇవ్వడం అసాధ్యంగా మారింది. ఎన్నికల మేనిఫెస్టోలో జగన్ ప్రతి ఏటా 10 వేల పోస్టులతో జంబో డీఎస్సీ ఇస్తానని ప్రకటించారు. జగన్ మాట ప్రకారం ఈ మూడేళ్లలో ప్రతి ఏటా 10 వేల పోస్టుల చొప్పున, 30 వేల పోస్టులు ఇవ్వాల్సి ఉంది. కనీసం 10 వేల పోస్టులైనా ప్రకటించకుండా, కేవలం 502 పోస్టులతో డీఎస్సీ ఇవ్వడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జంబో డీఎస్సీ వస్తుందనే ఆశతో మూడేళ్ల నుంచి వివిధ ప్రైవేట్ సంస్థల్లో వేలాది రూపాయలు ఖర్చు చేసి అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం డీఎస్సీని అరకొర ఖాళీలతో ప్రకటించడంపై వారికి దిక్కుతోచని స్థితి ఎదురయింది.

దేవదాయశాఖకు సలహాదారా?

(మొదటిపేజీ తరువాయి)

నియామకాన్ని తప్పుబట్టింది. ప్రభుత్వ శాఖలకు సలహాదారులేమిటని విస్మయం వ్యక్తం చేసింది. ఇలానే వదిలేస్తే రేపు అడ్వకేట్ జనరల్‌కు కూడా సలహాదారుని నియమిస్తారమంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. సలహాదారులను నియమించేందుకు అధికారుల కొరత ఉందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సలహాదారులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారన్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. మంత్రులకు సలహాదారులు ఉంటే అర్థం ఉందని, శాఖలకు సలహాదారు ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. శ్రీకాంత్ నియామక జీవోను నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు ఇచ్చింది.

ఒక్కటవుదాం

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కోబోతోందని అన్నారు. జాతీయ స్థాయిలో 40 లోక్‌సభ స్థానాలపై దృష్టి ఉండగా బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ కలిసి ఆ స్థానాలను విపక్షాలు కైవసం చేసుకోగలవన్న నమ్మకం ఉందని చెప్పారు. ఇతర పార్టీలు కూడా దేశవ్యాప్తంగా బీజేపీ పతనానికి కలిసి పనిచేస్తే సబబుగా ఉంటుందన్నారు.

ఫతేబాద్ ర్యాలీకి ఓపీ చౌతాలా, లాలూ ప్రసాద్ వంటి బడా నేతలు హాజరుకానున్నారు. వీరిద్దరు తమ రాష్ట్రాలను అనేకమార్లు పాలించారు. అవినీతి ఆరోపణలతో జైలు పాలయ్యారు. వీరి గైర్హాజరిలో ఆయా పార్టీల పగ్గాలను తనయులు అభయ్ సింగ్ చౌతాలా, తేజస్వీ యాదవ్ చేపట్టారు. ఇద్దరు సీనియర్ నేతల పట్టు సడలలేదు. 2024 చివరిలో హరియాణాలో ఎన్నికలు జరగనున్నాయి. జన్నాయక్ జనతా పార్టీతో కలిసి బీజేపీ పోటీ చేయనుంది. ఉప ముఖ్యమంత్రి దుశ్యంత్ చౌతాలా, ఆయన తండ్రి అజయ్ చౌతాలా నేతృత్వంలోని జేజేపీ ఇంతకుముందు ఐఎన్ఎల్‌డీ నుంచి వేరుపడింది. బీహార్‌లో జేడీ(యూ), ఆర్జేడీ జతకట్టాయి. హరియాణాలో కాంగ్రెస్‌తో కలిసి ఐఎన్ఎల్‌డీ కూటమి ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. ఈ రెండు పార్టీలకు రాష్ట్రంలోని జాట్ ఓట్లే బలం. మాజీ సీఎం భూపీందర్ సింగ్ హూడా శక్తిమంతమైన నేతగా హరియాణాలో ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌తో బీహార్ నేతలు కలిసి వస్తుండటంతో హరియాణాలో కాంగ్రెస్‌కు దగ్గరయ్యేందుకు ఐఎన్ఎల్‌డీకి అవకాశం లభిస్తుంది. ఈ పొత్తు కుదిరితే రాష్ట్రంలో బీజేపీ-జేజేపీ కూటమికి పెద్ద సవాల్ తప్పదు. దీనిని గ్రహించిన చౌతాలా.. హరియాణాలోని ఫతేబాద్‌లో జరిగే ర్యాలీ భావసారూప్యతగల నేతలకు ఉమ్మడి వేదిక కాబోతున్నట్లు ఐఎన్ఎల్‌డీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నొక్కిచెప్పారు. హరియాణాలో తమకున్న అవకాశాలను ఐఎన్ఎల్‌డీ గ్రహిస్తోంది. రాష్ట్రాన్ని బీజేపీ-జేజేపీ లూటీ చేస్తున్నట్లు అభయ్ చౌతాలాతో పాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నఫే సింగ్ రథి విమర్శించారు. ఈ ప్రభుత్వ హయాంలో రైతులు, ఇతర సామాజిక వర్గాల వారు అణచివేతకు గురవుతున్నట్లు ఆరోపించారు. వివాదాస్పద సాగు చట్టాలు, అగ్నిపథ్ పథకం, విద్యుత్ చట్టాలకు సవరణలను ప్రస్తావించారు. తగిన ప్రణాళికతో ముందుకెళితే ప్రజల్లో పాలకపక్షంపై ఉన్న ఆగ్రహం ఓట్ల రూపంలో తమదరి చేరుతుందని ఐఎన్ఎల్‌డీ గట్టిగా నమ్ముతోంది.

డచ్,చైనా ప్రధానుల భేటీ

బీజింగ్: చైనా, నెదర్లాండ్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ప్రధాని లీ కెకియాంగ్ డచ్ ప్రధాని మార్క్ రుట్టేతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌తో సంబంధాలను పెంపొందించుకోవడానికి చైనా అధిక ప్రాధాన్యతనిస్తుందని లీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు దేశాధినేతలు అభినందన సందేశాలను ఇచ్చిపుచ్చుకున్నారు. రెండు దేశాల ప్రజలకు బహుళ ప్రయోజనాలను అందించడానికి, సమగ్ర సహకారం కోసం ఆచరణాత్మక భాగస్వామ్యాన్ని మరింత ఉత్పాదకంగా నెదర్లాండ్స్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందన్నారు. రాజకీయ పరస్పర విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి, సహకార సామర్థ్యం పెంపుదలకు, కమ్యూనికేషన్‌ను వేగవంతానికి చైనా సిద్ధంగా ఉందన్నారు. పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా, ఆర్థికం, వాణిజ్యం, రవాణా, ఆవిష్కరణ, వాతావరణ మార్పు వంటి రంగాలలో ఆచరణాత్మక,బహిరంగ సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడానిక, విభేదాలను సరిగ్గా నిర్వహించడానికి చైనా నెదర్లాండ్స్‌తో కలిసి పని చేస్తుందని అన్నారు.

నెదర్లాండ్స్ నుంచి చైనా మార్కెట్‌లోకి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను చైనా స్వాగతిస్తున్నట్లు ప్రధాని చెప్పారు. రెండు దేశాల మధ్య ఇంటర్‌ఫ్లో, మార్పిడి, సహకారాన్ని పెంచడానికి చైనా సిద్ధంగా ఉందన్నారు. చైనా, నెదర్లాండ్స్ మధ్య మంచి సంబంధాలు, సహకారం రెండు దేశాలకు, చైనా-యూరోప్ సంబంధాల ఆరోగ్యకరమైన, స్థిరమైన వృద్ధికి అనుకూలంగా ఉన్నాయని లీ నొక్కిచెప్పారు. రెండు దేశాలు దౌత్య సంబంధాల 50వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నందున, వాణిజ్యం, రవాణా, వ్యవసాయం మరియు వాతావరణ మార్పులు, ముందస్తు సిబ్బంది మార్పిడి, ద్వైపాక్షిక కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి నెదర్లాండ్స్ చైనాతో కలిసి పనిచేస్తుందని రుట్టే చెప్పారు.

లేపాక్షి భూములు రైతులకు అప్పగించాలి

(మొదటిపేజీ తరువాయి)

మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారని పేర్కొన్నారు. ఆ భూముల్ని బ్యాంకుల్లో తనఖాపెట్టి రూ.4 వేల కోట్ల రుణాలు తీసుకొని, అప్పు చెల్లించకుండా దివాలా ప్రక్రియ చేపట్టారని వివరించారు. ఇవాళ రూ.10 వేల కోట్ల విలువ చేసే ఆ భూములను కారుచౌకగా రూ.500 కోట్లకు దక్కించుకునేందుకు అరబిందో, రాంకీ, ఎర్తిన్ సంస్థలు పోటీపడుతున్నట్లు తెలుస్తోందని వివరించారు. ఈ మూడు కంపెనీలు జగన్ అనుయాయులకు చెందినవి కావడంతో ఇందులో కుట్రకోణం వెలుగుచూసిందని విమర్శించారు. 'రివర్స్ టెండరింగ్'తో ప్రభుత్వానికి లాభం చేకూరుస్తున్నామంటూ పదేపదే ఊదరగొడుతున్న జగన్ సర్కార్..లేపాక్షి భూముల వ్యవహారంలో ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. లేపాక్షి భూముల అమ్మకానికి సంబంధించి కనీసం మంత్రివర్గంలో ఎందుకు సమీక్షించలేదని, ఏపీఐఐసీ పెట్టుబడులను తిరిగి తీసుకునేందుకు ఎందుకు ప్రయత్నించలేదని నిలదీశారు.

రైతుల పొట్టకొట్టి గుత్త సంస్థలకు మేలు చేకూర్చే సీఎం జగన్ వైఖరిని తీవ్రంగా ఖండించారు. వేలాది కోట్ల రూపాయల విలువైన లేపాక్షి భూములను కారుచౌకగా అప్పగించాలనే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ఆ భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి, కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో భూపోరాటానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు.

వాగులో మునిగి ముగ్గురి మృతి

(మొదటిపేజీ తరువాయి)

ట్రైల్స్ తీసుకుని కదిరి నుంచి మంగళవారం రాత్రి ప్రొద్దుటూరుకు బయలుదేరారు. కనంపల్లె సమీపంలోని నామాలగుండు వద్దకు వచ్చేసరికి అక్కడ సిద్ధలింగేశ్వరస్వామిని దర్శించుకోవాలని నిశ్చయించుకున్నారు. అక్కడే వాగులో స్నానానికి వెళ్లి సుడిగుండం ఉందని తెలియక నీటిలో మునిగిపోయారు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో సంజీవరాయుడి తండ్రి ప్రొద్దుటూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫోన్ నంబరు ఆధారంగా ఆచూకి కోసం ప్రయత్నించగా నామాలగుండు వద్ద సిగ్నల్స్‌ను గుర్తించి, పులివెందుల పోలీసులు వెళ్లిచూడగా అక్కడ సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయి. అనంతరం గజ ఈతగాళ్ల ద్వారా గాలిస్తే మొదట రెండు మృతదేహాలు లభించాయి. ఆపై మూడవ మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బీహార్‌లో సీబీ'ఐ'

అసెంబ్లీలో బల పరీక్ష రోజునే ఆర్‌జేడీ నేతల ఇళ్లపై దాడులు

బీజేపీది దుర్మార్గ వైఖరి : ఆర్‌జేడీ, జేడీ(యూ), కాంగ్రెస్

పాట్నా : బీహార్‌లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర శాసనసభలో జనతాదళ్ (ఐక్య)-రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) కొత్త ప్రభుత్వం బలపరీక్ష ఎదుర్కొన్న రోజే కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆర్‌జేడీ నేతల నివాసాలపై దాడులు నిర్వహించింది. నితీశ్ కుమార్‌కు చెందిన అధికార జేడీ(యూ)... బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయించుకున్న తర్వాత దర్యాప్తు సంస్థ దాడులు జరగడం విశేషం. యూపీఏ-1 ప్రభుత్వంలో లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించిన 'ఉద్యోగాల కోసం భూమి' కేసుకు సంబంధించి ఈ దాడులు జరిగాయి. ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌కు చెందిన సంస్థ నిర్మించినట్లు భావిస్తున్న గురుగ్రామ్‌లోని నిర్మాణంలో ఉన్న మాల్‌తో సహా 25 ప్రదేశాలలో సీబీఐ సోదాలు నిర్వహించిందని అధికారులు తెలిపారు. దిల్లీ, గురుగ్రామ్, పాట్నా, మధుబని, కతిహార్ తదితర ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. గురుగ్రామ్‌లోని సెక్టార్ 71లో నిర్మాణంలో ఉన్న అర్బన్ క్యూబ్స్ మాల్‌ను వైట్‌ల్యాండ్ అనే కంపెనీ నిర్మిస్తోందని, ఇందులో యాదవ్ కుటుంబానికి యాజమాన్యంలో వాటా ఉందని వారు తెలిపారు. సునీల్ సింగ్, అష్ఫాక్ కరీం, ఫయాజ్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ సుబోధ్ రాయ్ సహా ఆర్జేడీకి చెందిన అనేక మంది సీనియర్ నాయకుల నివాసాలలో సోదాలు జరిగాయి. 'ఇది ఉద్దేశపూర్వకంగా జరుగుతోంది. అర్థం లేదు. మా ఎమ్మెల్యేలు భయంతో తమతో చేరతారనే ఆశతో వారు అలా చేస్తున్నారు' అని పాట్నా ఇంటిపై దాడి జరిగిన తర్వాత సునీల్ సింగ్ అన్నారు. కాగా మంగళవారం రాత్రి ఆర్‌జేడీ అధికార ప్రతినిధి ట్విట్టర్‌లో ఈ రకమైన చర్యను పార్టీ ఊహిస్తున్నట్లు సూచించింది. 'బీజేపీ మిత్రపక్షాలైన సీబీఐ, ఈడీ, ఐటీ త్వరలో బీహార్‌లో దాడులకు సిద్ధమవుతున్నాయి. పాట్నాలో సభ ప్రారంభమైంది. రేపు ముఖ్యమైన రోజు' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆర్‌జేడీ రాజ్యసభ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ 'ఇది ఈడీ లేదా సీబీఐ లేదా ఐటీ చేత దాడి అని చెప్పడం పనికిరానిది. ఇది బీజేపీ ద్వారా దాడి. వారు ఇప్పుడు బీజేపీ కింద పని చేస్తున్నారు. వారి కార్యాలయాలు బీజేపీ కథనంతో నడుస్తున్నాయి. నేడు బల పరీక్ష (బీహార్ అసెంబ్లీలో), ఇక్కడ ఏమి జరుగుతోంది? ఇది ఊహించదగినదిగా మారింది' అని అన్నారు. లాలూకి సన్నిహితుడిగా పేరొందిన సునీల్ సింగ్ తన అపార్ట్‌మెంట్ బాల్కనీ నుంచి మాట్లాడుతూ 'ఇది 100 శాతం ఉద్దేశపూర్వకంగా జరిగింది. స్థానిక పోలీసులకు కూడా సమాచారం ఇవ్వకుండా ఇంతమంది నా ఇంట్లోకి ప్రవేశించారు. పత్రంపై సంతకం చేయమని అడుగుతున్నారు' అని అరిచారు. సింగ్ భార్య మాట్లాడుతూ 'నా భర్త తన విధేయత కారణంగానే బలిపశువుగా మారుతున్నాడు. మా ఇంటి నుంచి సీబీఐకి ఏమీ లభించదు. నేను దర్యాప్తు సంస్థ పై పరువు నష్టం దావా వేస్తాను' అంటూ అరిచింది. ఆర్‌జేడీ అధికార ప్రతినిధి శక్తి సింగ్ యాదవ్ మాట్లాడుతూ 'నేను చాలా ఆశ్చర్యపోయాను. గత రాత్రి ఒక ట్వీట్‌లో ఈడీ, సీబీఐ, ఐటీ తమ తదుపరి కార్యాచరణను బీహార్‌లో ప్రణాళిక చేస్తున్నాయని పేర్కొన్నారు' అని అన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అసిత్ నాథ్ తివారి మాట్లాడుతూ గార్డుల మార్పుతో ఈ అధికారులు వారు పదవుల్లో ఉన్న సంస్థల ద్వారానే విచారణకు గురవుతారని, హిట్లర్ లేదా ముస్సోలినీ ఎప్పటికీ అధికారంలో ఉండరని ఈ సంస్థల అధికారులు గుర్తుంచుకోవాలని అన్నారు. జేడీ(యూ) అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ కూడా ఈ దాడులను ఖండించారు. సీబీఐ, ఈడీ ద్వారా బీహార్‌లో కేంద్ర ప్రభుత్వం శక్తి పరీక్ష (బల పరీక్ష) ప్రమాదకరమైన ఆట' అని ధ్వజమెత్తారు.

బల పరీక్ష నెగ్గిన నితీశ్ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

మహేశ్వర్ హజారీ బలపరీక్షకు అధ్యక్షత వహించారు. సభ్యుల సంఖ్యను లెక్కించేందుకు ఆదేశించారు. మూజువాణి మెజారిటీకి స్పష్టంగా మద్దతు ఇచ్చినప్పటికీ, గణన 'ఎలాంటి గందరగోళానికి ఆస్కారం ఇవ్వదు' అని చెప్పారు. మొత్తం 160 మంది ఎమ్మెల్యేలు విశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయగా, వ్యతిరేకంగా ఓటు వేయలేదు. రాష్ట్ర శాసనసభలో మొత్తం 243 మంది సభ్యులు ఉండగా, నితీశ్ సారథ్యంలోని మహాకూటమి ప్రభుత్వానికి 164 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్న విషయం తెలిసిందే. ఏఐఎంఐఎం నుంచి ఏకైక ఎమ్మెల్యే, అధికార కూటమిలో భాగం కాని అక్తరుల్ ఇమాన్ కూడా కసరత్తులో పాల్గొని విశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చారు. సీఎం నితీశ్ ప్రసంగిస్తుండగా, కొంతమంది బీజేపీ ఎమ్మెల్యేలు సభ నుంచి వాకౌట్ చేశారు. డిప్యూటీ స్పీకర్ అనవసరమైన వ్యక్తుల సంఖ్యపై సమయాన్ని వృథా చేయవద్దని, ఈరోజు షెడ్యూల్ చేసిన కార్యకలాపాలను చేపట్టాలని డిమాండ్ చేస్తూ సభను ముట్టడించి, సభను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీకి చెందిన విజయ్ కుమార్ సిన్హా రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ కావడంతో కొత్త స్పీకర్ ఎన్నిక కోసం గురువారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నట్లు డిప్యూటీ స్పీకర్ సభకు తెలియజేసి, తదుపరి కార్యక్రమాలను శుక్రవారానికి వాయిదా వేశారు.

మీరంతా పారిపోతున్నారా...? : బీజేపీ పై విరుచుకుపడిన నితీశ్

శాసనసభలో విశ్వాస పరీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రసంగిస్తూ, బీజేపీ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతలు కేవలం 2020 ఎన్నికల గురించే మాట్లాడవద్దని, అంతకుముందు జరిగిన ఎన్నికల్లో బీజేపీ కంటే జేడీ(యూ) ఎక్కువ సీట్లు గెలుచుకున్న సందర్భాలనూ గుర్తు చేసుకోవాలని సూచించారు. పాట్నా విశ్వవిద్యాలయానికి కేంద్ర హోదా కల్పించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. వాజ్‌పేయి, అద్వానీ వంటి నేతలు తననెంతో గౌరవంగా చూసేవారని అన్నారు. ఈరోజు దిల్లీ బయట జరుగుతున్నదంతా ప్రచారమేనని నితీశ్ పేర్కొంటూ, అసలు భారత స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. పత్రికలను కూడా స్వతంత్రంగా పని చేయనివ్వడం లేదని విరుచుకుపడ్డారు. సమాజంలో అలజడి సృష్టించడమే బీజేపీ పనిగా పెట్టుకొందని విమర్శించారు. మార్పు కోసం అందరం కలిసి పని చేయవలసిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. 'మీరంతా (బీజేపీ ఎమ్మెల్యేలు) పారిపోతున్నారా? నాకు వ్యతిరేకంగా మాట్లాడితేనే మీకు పార్టీలో స్థానం దక్కుతుంది. మీ అందరికీ మీ బాస్‌ల నుంచి ఆదేశాలు వచ్చి ఉండాలి' అని అన్నారు. 'మేము (ఆర్‌జేడీ, జేడీయూ) బీహార్ అభివృద్ధికి కలిసి పని చేస్తామని ప్రతిజ్ఞ చేశాం. ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా ఉన్న నాయకులు నాకు ఫోన్ చేసి అభినందించారు. 2024 ఎన్నికల్లో అందరూ కలిసి పోరాడాలని నేను కోరాను' అని నితీశ్ కుమార్ తెలిపారు. దాదాపు అరగంట పాటు సాగిన తన ప్రసంగంలో ఎల్‌జేపీకి చెందిన చిరాగ్ పాశ్వాన్ తిరుగుబాటు గురించి పరోక్షంగా ప్రస్తావించారు. బీజేపీ ఆదేశానుసారం, అతని మాజీ ఆశ్రిత ఆర్‌సీపీ సింగ్ ద్వారా జేడీ(యూ)లో చీలికకు కారణమవుతున్నారని ఆరోపించారు. తనకు వ్యక్తిగత ఆశయాలు లేవని, విపక్ష శిబిరంలో ప్రధాన మంత్రి అభ్యర్థి కావడమే తన ఆశయమంటూ బీజేపీ చేస్తున్న అభియోగాలను తోసిపుచ్చారు. ఇదిలాఉండగా, చర్చ సందర్భంగా బీజేపీ నేత తారకిషోర్ ప్రసాద్... నితీశ్ 'రాజకీయ విశ్వసనీయత' కోల్పోయారని విమర్శించారు. సొంతంగా ముఖ్యమంత్రి అయ్యే సామర్థ్యం లేకపోయినా ప్రధాన మంత్రి కావాలనే వ్యక్తిగత ఆశయం ఉందని ఎద్దేవా చేశారు.

మా సర్కారు కూల్చివేతకు ప్రధాని కుట్ర

న్యూదిల్లీ: దిల్లీలో తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రధాని నరేంద్రమోదీ కుట్ర పన్నారని ఆప్ అధినేత, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఘాటుగా విమర్శించారు. ఇందుకోసం తమ పార్టీ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారని, కోట్లాది రూపాయలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని మండిపడ్డారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 20 కోట్లు, ఇతర ఎమ్మెల్యేలను తీసుకువస్తే రూ.25 కోట్లు ఇస్తామని ప్రతిపాదించారని, ఈ విషయాన్ని తమ పార్టీ ఎమ్మెల్యేలు స్వయంగా తనకు చెప్పారని కేజ్రీవాల్ వివరించారు. తమ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుయుక్తులు పన్నుతోందని మండిపడ్డారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ అత్యవసరంగా సమావేశమవుతుందన్నారు. బీజేపీ తనకు సీఎం పదవి ఇస్తామని ప్రలోభ పెట్టిందని, ఆప్ నుంచి తప్పుకుంటే అన్ని కేసులను ఉపసంహరించుకుంటామని చెప్పారని మద్యం విధానం 2021-22 అమలులో అవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా రెండు రోజుల క్రితం ఆరోపించిన విషయం తెలిసిందే. తాజాగా సీఎం కేజ్రీవాల్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ 'కొందరు ఎమ్మెల్యేలు నన్ను కలిసి... తమను బెదిరించారని, పార్టీని విచ్ఛిన్నం చేయడానికి లంచాలు ఇవ్వజూపారని చెప్పారు. ఇది చాలా తీవ్రమైన విషయం. పరిస్థితిని సమీక్షించడానికి ఈ అంశంపై రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తాము' అని అన్నారు. 97 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన కార్యక్రమం అనంతరం కేజ్రీవాల్ దీనిపై మాట్లాడారు. సీబీఐ దాడుల గురించి ప్రశ్నించగా, ఈ ఏడాది చివరిలో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల వరకు విచారణ, దాడులు కొనసాగుతాయని చెప్పారు.

మరింత మందిని తీసుకువస్తే రూ.25 కోట్లు

దిల్లీలోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని, తమ పార్టీని విచ్ఛిన్నం చేయడానికి చూస్తోందని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. దిల్లీలోని అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చివేసి ఆప్ శాసనసభ్యులను బీజేపీలోకి తీసుకురావడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నాలు చేస్తున్నారని సింగ్ ఆరోపించారు. నలుగురు ఎమ్మెల్యేలు సోమనాథ్ భారతి, సంజీవ్ ఝా, కుల్దీప్, అజయ్ దత్‌లతో కలిసి బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీ మారకుంటే సీబీఐ, ఈడీ, తప్పుడు కేసులు పెడతామని తమకు బీజేపీ నుంచి బెదిరింపులు వచ్చాయని ఆరోపించారు. పార్టీ మారితే ఒక్కొక్కరికి రూ.20 కోట్లు ఇస్తామని, అలాగే తమతో పాటు మరి కొందరిని తీసుకువస్తే రూ. 25 కోట్లు ఇస్తామని ఆఫర్ వచ్చిందని అన్నారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాపై చేసిన ప్రయత్నం దిల్లీ ఎమ్మెల్యేల పై మొదలైందని ఆరోపించారు. దిల్లీ ఎమ్మెల్యేలపై విరుచుకుపడే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. డబ్బులిచ్చి దిల్లీ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సిసోడియాపై బీజేపీ 'షిండే'ని ప్రయోగించిందని, అయితే ఆ ప్రయత్నం విఫలమైందని, తాను 'బహిర్గతం' చేస్తానని, ఆప్ ఎమ్మెల్యేలు ఇప్పటికే బీజేపీ 'ఆపరేషన్ కమలం'ను 'ఆపరేషన్ బోగస్'గా మారుస్తున్నారని ఆయన అన్నారు. 'మీరు చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను బెదిరించి, పడగొట్టారు. కానీ ఇది దిల్లీ. ప్రజలు ఇక్కడ కేజ్రీవాల్‌ను మూడుసార్లు ఎన్నుకున్నారు' అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సోమ్‌నాథ్ భారతి మాట్లాడుతూ అధికారం, డబ్బును దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఎలా విచ్ఛిన్నం చేస్తారని ప్రశ్నించారు. 'నా మిత్రులైన బీజేపీ జాతీయ స్థాయి నేతల ద్వారా నాతో ఓ ప్రయత్నం జరిగింది. మీ కోసం రూ.20 కోట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మీరు ఇప్పుడు చెబితే అది అప్పుడు మీకు చేరుతుందని అన్నారు. మీరు ఇతర ఎమ్మెల్యేలను తీసుకువస్తే మీ రేటు రూ.25 కోట్లు ఇస్తామని వారన్నారని' తెలిపారు. పార్టీ మారాలని, లేకపోతే మనీశ్ సిసోడియా మాదిరిగా ఈడీ-సీబీఐ కేసులు పెడుతామని బెదిరింపులు వచ్చాయని సోమనాథ్ భారతి ఆరోపించారు. మనీశ్ సిసోడియా కేసు నకిలీదని తాను చెప్పానని అన్నారు. ఆప్‌కు చెందిన మరో ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ మాట్లాడుతూ పశ్చిమ దిల్లీకి చెందిన పెద్ద నాయకులు దిల్లీ నుంచే ఆప్ పార్టీ అంతం కాబోతోందని తనతో అన్నారని చెప్పారు. బీజేపీలో చేరితే రూ.20 కోట్లు ఇస్తామని చెప్పారని అన్నారు. అయితే తాము హార్డ్ కోర్ ఆమ్ ఆద్మీ పార్టీ వ్యక్తులమని, తాము పార్టీకి ద్రోహం చేయలేమని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే అజయ్ దత్తా మాట్లాడుతూ గతంలో ఎంపీగా ఉన్న ఓ రాష్ట్రానికి చెందిన నాయకుడు దిల్లీ ప్రభుత్వం పతనం కాబోతోందని, చాలా మంది ఎమ్మెల్యేలు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారని అన్నారు. బీజేపీ చాలా శక్తివంతమైనదని, పార్టీ సత్తా ఏంటో అర్థం చేసుకోవాలని, లేదంటే నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారని అన్నారు. బీజేపీలోకి చేరాలని లేకపోతే సీబీఐ కేసుల్లో ఇరికిస్తామని చెప్పారని ఆరోపించారు. తాము డబ్బులకు అమ్ముడుపోయే వాళ్లం కాదని, పార్టీకి, ప్రజలకు ద్రోహం చేయబోమని స్పష్టంగా చెప్పామని ఆయన వివరించారు.

చిన్న పరిశ్రమలను ఆదుకుంటాం

- 2023 కల్లా వెలుగొండ పూర్తి చేస్తాం
- చీమకుర్తి సభలో సీఎం జగన్
- వైఎస్సార్, బూచేపల్లి విగ్రహాల ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు బ్యూరో: చిన్న పరిశ్రమలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. చిన్న గ్రానైట్ కర్మాగారాలన్నీ నష్టపోకుండా విద్యుత్ ఛార్జీల్లో యూనిట్‌కు రూ.2 తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. 22 క్యూబిక్ మీటర్ల వరకు ముడి గ్రానైట్‌ను ప్రాసెస్ చేసే యూనిట్‌కు సింగిల్ బ్లేడ్ రూ.27వేలు, మల్టీ బ్లేడ్‌కు రూ.54 వేలు చొప్పున నెలకు ఇచ్చేట్లుగా స్లాబ్ వ్యవస్థ తెస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి జీవోను విడుదల చేశామన్నారు. దీని వలన సంవత్సరానికి ప్రభుత్వంపై రూ.350 కోట్ల అదనపు భారం పడుతున్నదన్నారు. పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తాము మొదటి టన్నెల్ పనులు పూర్తి చేశామని, రెండవ టన్నెల్ పనులు 2023 సెప్టెంబరు కల్లా పూర్తి చేసి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బుధవారం ప్రకాశం జిల్లా, చీమకుర్తిలో కీశే. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి కాంస్య విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరినట్లు జిల్లా కేంద్రమైన ఒంగోలులో శిథిలావస్థలో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయ నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తాళ్లూరు మండలంలోని శివరాంపురంలో ఉన్న మొగిలిగుండ్ల చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చి ఆ ప్రాజెక్టుకు బూచేపల్లి సుబ్బారెడ్డి రిజర్వాయర్‌గా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు.

మంచి చేస్తే మనిషికి మరణం ఉండదని, ప్రతీ గుండెలోనూ సజీవంగా నిలిచే ఉంటారనడానికి నిదర్శనం ఈ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమమే అని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం అంటే ముందుగా గుర్తొచ్చే పేరు వైఎస్సార్‌దన్నారు. రైతుల సంక్షేమం, ఉచిత విద్యుత్, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యం ఇలా అనేక మంచి పథకాలను తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ బిడ్డగా తాను మరింత మంచి చేస్తానని హామీనిచ్చారు. 95 శాతం మేనిఫెస్టో హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. వచ్చే ఏప్రిల్ 14న విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటించారు. గాంధీ, అంబేద్కర్, పూలే, అల్లూరి, ప్రకాశం, వైఎస్సార్ వంటి మహనీయులు ప్రజల గుండెల్లో సజీవంగా ఉంటారని జగన్ తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం గ్రానైట్ స్లాబ్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాగార్జున, పురపాలక మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంకృష్ణమూర్తి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎంపి నందిగం సురేష్, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, జిల్లా ఎస్పీ మలిక గర్గ్, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎమ్మెల్సీ పోతుల సునీత పాల్గొన్నారు.

28న 'ఆచంట' స్మారక సాహితీ పురస్కారం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆచంట కళాంజలి-త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ పాత్రికేయులు ఆచంట సుదర్శనరావు స్మారక సాహితీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 28న హైదరాబాద్‌లోని చిక్కడపల్లి కళా సుబ్బారావు కళావేదిక (త్యాగరాయ గానసభ)లో నిర్వహిస్తున్నట్టు ఆచంట కళాంజలి అధ్యక్షురాలు పద్మావతి, త్యాగరాయ గానసభ ప్రధాన కార్యదర్శి కళా శారద బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కవి, సాహితీవేత్త సన్నిధానం నరసింహ శర్మను పురస్కారంతో సన్మానించనున్నట్టు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త, తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ టీ గౌరీశంకర్, విశిష్ఠ అతిథులుగా హాస్యబ్రహ్మ శంకరనారాయణ, సీనియర్ పాత్రికేయులు, మాజీ సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి జీ వల్లీశ్వర్, ఆత్మీయ అతిథిగా ప్రముఖ కవి, సాహితీవేత్త వేణు సంకోజు విచ్చేస్తారని తెలిపారు. సభను త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి ప్రారంభిస్తారని చెప్పారు. ప్రధాన ప్రసంగీకులుగా ప్రముఖ పాత్రికేయులు, ఏపీ ప్రభుత్వ మాజీ సలహాదారు కే రామచంద్రమూర్తి వ్యవహరిస్తారని అన్నారు. ప్రముఖ కవి, సాహితీవేత్త సాధన నరసింహాచార్యుల అధ్యక్షతన జరిగే సాహితీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు, సాహితీ ప్రియులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులపై అధికారుల వేధింపులు అరికట్టాలి

ఎండీకి ఆర్టీసీ జేఏసీ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులపై కొందరు అధికారులు, సూపర్‌వైజర్ల అహంకార, కక్ష సాధింపు చర్యలు పెరిగిపోతున్నాయని, వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులకు అది దారితీస్తోందని ఆర్టీసీ జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎండీ ద్వారకా తిరుమలరావుకు బుధవారం జేఏసీ కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సిహెచ్.సుందరయ్య, వైఎస్ రావు, నేతలు వైవీ రావు, పి.రమణారెడ్డి లేఖ రాశారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరి డిపోలో ఏడీసీగా పనిచేస్తున్న సిహెచ్.చెంచయ్య ఆత్మహత్య వెనుక అధికారుల ఒత్తిళ్లే కారణమనీ, దానిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్ఆర్ కడప జిల్లా పొద్దుటూరు డిపో ఏఎం(పీ) నజీర్ అహమ్మద్‌పై డిపో మేనేజర్ ఫోన్లో దుర్భాషలాడిన తీరు ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సంఘటనలపై తక్షణమే చొరవ తీసుకుని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రంగనాయకులు

విశాలాంధ్ర-బాపట్ల: మున్సిపల్ ఒప్పంద కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆసుల రంగనాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లోని అమరజీవుల ప్రాంగణంలో జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. తొలుత అంబేద్కర్ భవన్ నుంచి పాత బస్టాండ్ వరకు కార్మికులు భారీ ర్యాలీ చేపట్టారు. సభ ప్రాంగణం వద్ద డీవీ సుబ్బారావు కార్మిక జెండాను ఆవిష్కరించి అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో రంగనాయకులు మాట్లాడుతూ... కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మున్సిపాలిటీలో గత పదేళ్ల నుండి కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నవారికి వెంటనే క్రమబద్ధీకరించాలని, కార్మికులకు వర్తించే ఇతర అన్ని రాయితీలను కల్పించాలని డిమాండ్‌చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటి దాస్ మాట్లాడుతూ... కార్మికుల ప్రావిడెంట్ ఫండ్ వారి ఖాతాల్లో సక్రమంగా జమ చేయటంలేదన్నారు. లా బాధ్యతను మున్సిపల్ అధికారులు తీసుకోవాలన్నారు. గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులందరినీ ఆప్కాస్ నుంచి తొలగించి వారికి ప్రభుత్వం ఇచ్చే అన్ని రాయితీలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరపాటి సత్యనారాయణ, సీపీఐ జిల్లా అధ్యక్షుడు పి.నాగాంజనేయులు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తన్నీరు సింగరకొండ, బాపట్ల జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, రేపల్లె సీపీఐ కార్య దర్శి జి.బాలాజీ, చీరాల ఏఐటీయూసీ అధ్యక్షుడు జి.బాబు రావు ప్రసంగించారు. కార్మికుల సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని కోరారు. బాపట్ల జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ తొలి మహాసభ ఘనంగా జరిగిందని కార్మికుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపిందని సభాధ్యక్షుడు జేబీ శ్రీధర్ తెలిపారు.

పారిశ్రామికవేత్త మద్ది లక్ష్మయ్య మృతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట రూరల్: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మద్ది లక్ష్మయ్య (96) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య సీతాదేవి, ఇద్దరు కుమారులు వెంకటేశ్వరరావు, రమేష్, కుమార్తె అరుణ ఉన్నారు. మద్ది లక్ష్మయ్య భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు చిలకలూరిపేటకు తీసుకువచ్చారు. ఆయన స్వగ్రామమైన పసుమర్రులో తండ్రి మద్ది కామయ్య పేరుతో జెడ్పీ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయించారు. ఇటీవల పాఠశాల అభివృద్ధికి కూడా ఇతోధిక సాయం అందించారు. గ్రామంలో కోదండ రామాలయం, తాండవేశ్వర స్వామి ఆలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయాల అభివృద్ధికి సేవలందించారు. మద్ది లక్ష్మయ్య పొగాకు ఉత్పత్తి, ఎగుమతి రంగంలో అంతర్జాతీయంగా పేరు గడించారు. పొగాకు మార్కెటింగ్, ప్యాకేజింగ్, గోడౌన్‌లు, ఐటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర రంగాల్లో ఎంఎల్ గ్రూపును విస్తరించి ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు సేవలందిస్తున్నారు. ఎంఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రధాన కార్యాలయం గణపవరంలో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు లక్ష్మయ్య సమీప బంధువు. ఆయన చిలకలూరిపేట కృష్ణమహల్ సెంటర్‌లోని సీఆర్ క్లబ్ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. 2004 ఎన్ని కలలో నరసరావుపేట పార్లమెంట్ నుంచి తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. లక్ష్మయ్య మృతికి అనేకమంది ప్రముఖులు సంతాపం తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు, వైసీపీ కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల కో-ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మద్ది లక్ష్మయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో ఆయన కంపెనీల నుంచి వేలాదిగా కార్మికులు పాల్గొని ఘనంగా తుది వీడ్కోలు పలికారు.

నారాయణ, సురవరం సంతాపం

మద్ది లక్ష్మయ్య మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా మద్ది లక్ష్మయ్య మెలిగేవారని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. లక్ష్మయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈమేరకు సంతాప సందేశం విడుదల చేశారు. సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి వి.చెన్నకేశవరావు లక్ష్మయ్య మృతికి సంతాపం తెలిపారు.

మంచి వ్యక్తిని కోల్పోయాం: ముప్పాళ్ల

వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన మంచి వ్యక్తి మద్ది లక్ష్మయ్య అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. లక్ష్మయ్య మృతి వార్త తెలుసుకున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల రంగంలో చిలకలూరిపేట ఖ్యాతిని దేశం మొత్తం విస్తరింప చేసిన వ్యాపార దిగ్గజం మద్ది లక్ష్మయ్య అని కొనియాడారు. పార్టీలకు అతీతంగా తమ సీపీఐ నాయకులతో సన్నిహిత సంబంధాలను కొనసాగించారని గుర్తుచేసుకున్నారు. ముప్పాళ్లతోపాటు ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా ఇన్‌చార్జి షేక్ సుభాని, నాయకులు పేలూరి రామారావు, చెరుకుపల్లి సృజన్, నరసింహభారతి, నాయుడు శివకుమార్, గాత్రం భగత్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేయాలి

అమరావతి జేఏసీ నేతలు బొప్పరాజు, వైవీ రావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఒప్పంద సిబ్బంది శ్రమదోపిడీ ఇంకెంత కాలం? వెంటనే వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని అమరావతి జేఏసీ నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వైవీ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జేఏసీ నేతలు ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈనెల 29న జరగబోయే మంత్రివర్గ సమావేశంలోనైనా చర్చించి, ఒప్పంద ఉద్యోగుల్ని క్రమబద్ధీకరించాలన్నారు. దాదాపు 30వేల మంది ఒప్పంద ఉద్యోగులు 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ఎలాంటి సౌకర్యాలు లేకుండా చాలీ చాలని వేతనాలతో కష్టపడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీ, నేటికీ అమలు చేయకపోవడంతో వారంతా నిరాశకు గురయ్యారన్నారు. న్యాయస్థానాలు సైతం అర్హతలు కలిగిన ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సూచించినప్పటికీ, ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఏటా ఒప్పందాన్ని పొడిగించడం దురదృష్టకరమని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పీఆర్సీ, టీఏ, డీఏ తరహా ఆర్థిక ప్రయోజనాలు వారికి వర్తించడం లేదన్నారు. కరోనా కాలంలో చాలా మంది చనిపోయినప్పటికీ, ఏ ఒక్కరికీ కారుణ్య నియామ కాలు లేవని పేర్కొన్నారు. కనీసం హెల్త్ కార్డులు వారికి ఇవ్వలేదని, ఎలాంటి ప్రభుత్వ పథకాలు వారికి వర్తింపజేయడం లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'కొమ్మాలపాటి' సేవలు మరువలేనివి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-పెదకూరపాడు: సీపీఐ సీనియర్ నేత, పెదకూరపాడుకు చెందిన కొమ్మాలపాటి వెంకటప్పారావు సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. నాటి మాజీ ఎమ్మెల్యే దర్శి లక్ష్మయ్య స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు ఆకర్షితులై ఈనాటి వరకూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల పక్షాన అనేక ఉద్యమాల్లో చురుకైన పాత్ర వహించారని పేర్కొన్నారు. కొమ్మాలపాటి అప్పారావు(95) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా బుధవారం పెదకూరపాడులో అంత్యక్రియలు నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ, పెదనాన్న అప్పారావు సీపీఐలో ప్రముఖ పాత్ర వహించారని చెప్పారు. టీడీపీలో తాను ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులంతా సీపీఐలోనే ఉన్నారన్నారు. తనకు సలహాలు, సూచనలు ఇస్తూ ఉండేవారని శ్రీధర్ అన్నారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, అమరావతి జేఏసీ నాయకులు మల్లికార్జునరావు, హనుమంత్ రెడ్డి, మురళి కృష్ణ, ఏఐటీయూసీ నాయకులు హనుమంతరావు, సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమల రమేష్, బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు, గల్లా బాబురావు, కంచె పెద్ద అబ్బయ్య, అభ్యుదయ కవి దర్శి శేషారావు, రైతు సంఘం నాయకుడు కంచేటి పెద్దబ్బాయి, భాషను ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు, కిషోర్ కృష్ణ, చల్లా పానయ్య, సీపీఐ పత్తిపాడు నియోజవర్గ కార్యదర్శి ముసునూరి రమేష్, నరిశేటి వేణుగోపాల్, పొట్టి మల్లేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సైదా, సీపీఐ నాయకులు పోతుగంటి నాగేశ్వరరావు, పాండు, యాదగిరి, టి.ప్రసాదు, ఏసోబు, రత్నబాబు, పేతురు, చల్లా తదితరులు అప్పారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ పారివేందర్

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఘనంగా 'ఫౌండర్స్ డే'

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యను అందించేందుకు ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పిన యూనివర్సిటీ వ్యవస్థాపకులు డాక్టర్ టీఆర్ పారివేందర్ అభినందనీయులని యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య వజ్జా సాంబశివరావు అన్నారు. డాక్టర్ పారివేందర్ పుట్టిన రోజైన ఆగస్టు 24వ తేదీని యూనివర్సిటీ యాజమాన్యం ఏటా ఫౌండర్స్ డేగా జరుపుకుంటుంది. ఈ సందర్భంగా బుధవారం యూనివర్సిటీ విద్యార్థులు ప్రేరణ వనం కార్యక్రమం కింద నీరుకొండ, కురగల్లు గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య వజ్జా సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం మంగళగిరి సౌజన్య వయోవృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ జరిగింది. వృద్ధులకు పండ్లు పంపిణీ చేసిన వీసీ వీఎస్ రావు డాక్టర్ పారివేందర్ సేవలను కొనియాడారు. విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాలతో పాటు రాజకీయ రంగంలోనూ విశేష సేవలందిస్తోన్న డాక్టర్ పారివేందర్‌ను బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేర్కొన్నారు. వృద్ధుల పట్ల వ్యక్తిగత శ్రద్ధ కనబరుస్తున్న ఆశ్రమ నిర్వాహకులను వీసీ అభినందించారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్, స్టూడెంట్స్ అఫైర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రేవతీ బాలకృష్ణన్ చినకాకానిలోని ఆనంద శరణాలయంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.

మాన్‌సింగ్ తండాలో కిడ్నీ వ్యాధితో ఒకరి మృతి

విశాలాంధ్ర-ఏ కొండూరు: మండలంలోని గిరిజన తండాలలో కిడ్నీ మరణాల పరంపర కొనసాగుతూనే ఉంది. కిడ్నీ వ్యాధితో మృతి చెందిన వారి చితి మంటలు ఏదో ఓ గ్రామంలో నిత్యం మండుతూనే ఉన్నాయి. కృష్ణారావు పాలెం పంచాయతీ పరిధిలోని మాన్సింగ్ తండాకు చెందిన బరోతు బాలాజీ (50) మంగళవారం రాత్రి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. తమ తండ్రి మూడు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని మృతుడి కుమారులు శ్రీను, నాగరాజు తెలిపారు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నామని చెప్పారు. చికిత్స పొందుతూనే మృతి చెందాడన్నారు. ఇప్పటివరకు కుటుంబమంతా కష్టపడి పనిచేసి వచ్చిన సొమ్ముతోనే తండ్రికి వైద్యం చేయించామని, మెరుగైన వైద్యం చేయించే స్థోమత లేకపోవడం వల్లే మరణించాడని కన్నీరు మున్నీరయ్యారు. గిరిజనులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు.

రణబీర్‌సింగ్ ఆశయాలు నెరవేరుద్దాం

ఇప్టా జాతీయ అధ్యక్షుడికి ప్రజానాట్య మండలి నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్ (ఇప్టా) జాతీయ అధ్యక్షుడు రణబీర్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సమితి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్, రాష్ట్ర కార్యదర్శి షేక్ నజీర్ అన్నారు. స్థానిక దాసరి భవన్‌లో బుధవారం నజీర్ అధ్యక్షత రణబీర్‌సింగ్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా చంద్రానాయక్ మాట్లాడుతూ, భారతీయ సాంస్కృతిక రంగం రణబీర్‌సింగ్ నాయకత్వంలో అభివృద్ధి చెందిందన్నారు. రచయితగా, నటుడుగా సమాజాన్ని చైతన్యవంతం చేశారని తెలిపారు. రాజవంశంలో జన్మించి, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యనభ్యసించిన ఆయన, దేశంలో కళారంగాన్ని ఎంపిక చేసుకుని జీవించారని చెప్పారు. ఎంతో మంది కళాకారులను తయారు చేశారన్నారు. నేడు దేశాన్ని పాలిస్తున్న మోదీ ప్రభుత్వం సాంస్కృతిక వినాశనానికి పాల్పడుతుందని ఆరోపించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో మంగళవారం జైపూర్‌లో రణబీర్‌సింగ్ మృతిచెందడం బాధకరం అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

నజీర్ మాట్లాడుతూ, రణబీర్‌సింగ్ నిరాడంబరంగా ఉండేవారని తెలిపారు. ఇప్టాకు అనుబంధ సంస్థగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆయనతో కలిసి అనేక కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందన్నారు. కళాకారుడిగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి దోనేపూడి సూరిబాబు మాట్లాడుతూ, మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసే బాధ్యత కళాకారులపై ఉందన్నారు. నగర ఇన్‌చార్జ్ లంకా దుర్గారావు మాట్లాడుతూ, ప్రజా కళాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావటానికి రణబీర్‌సింగ్ చేసిన కృషి మరువలేనిదన్నారు. 1928 జూలై 7న జన్మించిన రణబీర్‌సింగ్... కళ ప్రజల కోసమే అని భావించేవారని, కళాకారుడిగా పాట పాడినా, స్కిట్ ఆడినా ప్రజలు జేజేలు పలికారని తెలిపారు. నగర గౌరవాధ్యక్షుడు కేవీ భాస్కరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాయికుమార్, నగర నాయకులు లంకా గోవిందరాజులు ప్రసంగించారు. తొలుత రణబీర్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, ఇప్టా మాజీ జాతీయ కార్యదర్శి పులి సాంబశివరావు బుధవారం ఓ ప్రకటనలో రణబీర్‌సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

4న రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబరు 4న కడపలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే లలితమ్మ పిలుపునిచ్చారు. రాష్ట్ర సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో సంఘ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్పతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పని భారం పెంచి జీతాలు తక్కువ ఇస్తోందన్నారు. పనికితగిన వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం నెలకు రూ. 20 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఐదు లక్షల ఇవ్వాలని, వైఎస్సార్ మెనూ రేట్లు అమలు చేయాలనీ, గ్యాస్, వంట సామాగ్రి ప్రభుత్వమే సమకూర్చాలని, అన్ని రకాల బిల్లులు ఐదో తేదీ లోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జీ చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కామేశ్వరి, జయశ్రీ, మర్థమ్మ, కావేరి, రాజ్యలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

పాలనా భాషగా తెలుగు అమలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పాలనా భాషగా తెలుగును అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాలానుగుణంగా తగిన ఆదేశాలు జారీ చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ తెలిపారు. తెలుగు భాష పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే అన్ని చర్యలు తీసుకుందని వివరించారు. జీవో 40లో నిర్దేశించిన విధంగా తెలుగు భాషను పాలనా భాషగా అమలు చేయడంపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ బుధవారం వెలగపూడి సచివాల యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమీర్ శర్మ మాట్లా డుతూ తెలుగు భాష పరిరక్షణ కోసం ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపట్టిందని, రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా వ్యవహరిస్తామని వివరించారు. యార్లగడ్డ మాట్లాడుతూ బోధన భాషకు, పాలన భాషకు తేడా ఉందని, ఇకపై 'ఏపీ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ' ద్వారా తెలుగు అధికార భాషగా అమలు జరుగు తున్న తీరును డివిజనల్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రమం తప్పకుండా సమీక్షిస్తామన్నారు. శాస్త్ర, సాంకేతిక, న్యాయ, పరిపాలనా రంగాల్లో, ఇతర భాషల్లో వస్తున్న పారిభాషిక పదాలకు తెలుగులో ప్రత్యామ్నాయ పదాలు తయారు చేసుకోవటానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని, ఇందుకోసం 'పద నిధి'ని ఏర్పాటు చేయనున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉండాలనే ఉద్దేశంతోనే ముఖ్య మంత్రి ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన ప్రవేశ పెట్టారని, అయితే తెలుగు భాష ఒక పాఠ్యాంశంగా ఉంటుందని యార్లగడ్డ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక లాపాలకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు, నామ ఫలకాలు, బోర్డులు, ఫ్లెక్సీలు, ప్రారంభోత్సవ శిలాఫల కాలన్నీ తెలుగులోనే ఉండాలని, వాటిని ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత తెలుగు భాషపై మక్కువ పెంచేలా వివిధ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఇంటర్, తత్సమాన తరగతుల్లో తెలుగును మొదటి భాషగా అమలు జరిగేలా చూస్తామని యార్లగడ్డ అన్నారు. భారత ప్రభుత్వ ప్రాచీన తెలుగు భాషా కేంద్రం నిర్వహించే ప్రాజెక్టు వర్కులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ ఆదేశాలకు లోబడి తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అజమాయిషీ, పాలనా వినియోగం కోసం రూ.25 కోట్ల మూలధనంతో ఏర్పాటు చేసిన నిధి ఇకపై 'తెలుగు భాషాభివృద్ధి నిధి'గా వ్యవహరించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా సంస్థ యజమాని తమ నామఫలకాన్ని తెలుగులో ప్రదర్శించకపోతే రూ.50వేల జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని, అలాగే ప్రభుత్వ శంకుస్థాపన, ప్రభుత్వ శాఖల ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ తెలుగులో లేకపోయినా, ప్రారంభోత్సవాల్లో శిలాఫలకాలు తెలుగులో లేకపోతే రూ.10వేల జరిమానా అమలులో ఉందన్నారు. శాఖాధిపతి అధికారభాషగా తెలుగు అమలును సమీక్షించని ఎడల రూ.5వేల జరిమానా, ప్రభుత్వ ఉద్యోగి తెలుగు భాష ఉపయోగించకపోతే రూ.10వేల జరిమానా, ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలుగు పాఠ్యాంశంగా అమలు చేయకపోతే రూ.50 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధించవచ్చని యార్లగడ్డ తెలిపారు.



జీవో 40 అమలుపై యార్లగడ్డ వినతికి స్పందిస్తూ సీఎస్ సమీర్ శర్మ

కాంగ్రెస్ అధ్యక్షుడిగా అశోక్ గెహ్లాట్?

సోనియా కోరినట్లు ప్రచారం

న్యూదిల్లీ: గాంధీ కుటుంబానికి అత్యంత నమ్మకస్థుడు, విధేయుడు అశోక్ గెహ్లాట్ కాంగ్రెస్ తదుపరి అధ్యక్షుడు కాబోతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పార్టీ అధ్యక్ష పదవికి ఎన్నిక జరుగుతుందా? ఎంపిక జరుగుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం సోనియా గాంధీ వైద్య పరీక్షల కోసం విదేశాలకు వెళ్తున్నారు. ఆమెతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా కూడా వెళ్తున్నారు. ఇదిలావుండగా రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో మంగళవారం రాత్రి సోనియా గాంధీ రహస్య సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టాలని గెహ్లాట్‌ను సోనియా కోరినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని గెహ్లాట్ వద్ద మీడియా బుధవారం ప్రస్తావించినపుడు.. తాను మీడియా ద్వారా ఈ వార్తలను విన్నానని తెలిపారు. దీని గురించి తనకేమీ తెలియదన్నారు. తనకు అప్పగించిన పనిని తాను నిర్వహిస్తున్నానని చెప్పారు. మొదట్లో వెల్లడించిన వివరాల ప్రకారం సెప్టెంబరు 20నాటికి కాంగ్రెస్‌కు నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవలసి ఉంటుంది. అయితే రాహుల్ గాంధీ ఆ పదవి చేపట్టబోనని భీష్మించుకుని కూర్చున్నారు. ప్రియాంక గాంధీ కూడా అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో తమకు విశ్వాసపాత్రుడైన అశోక్ గెహ్లాట్‌ను ఆ పదవిలో నిలపాలని సోనియా కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. విదేశాలకు వెళ్తున్న సోనియా, రాహుల్, ప్రియాంక తిరిగి సెప్టెంబరు 4నాటికి స్వదేశానికి వస్తారని తెలుస్తోంది. రాహుల్ గాంధీ సెప్టెంబరు 7 నుంచి ప్రారంభమయ్యే భారత్ జోడో ఆందోళన్‌లో పాల్గొంటారు. ఇటీవల అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని రాహుల్ గాంధీ చేపట్టాలన్నారు. ఆయన ఆ పదవి చేపట్టకపోతే దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌వారంతా నిరుత్సాహానికి గురవుతారని చెప్పారు. చాలామంది ఇళ్లలోనే కూర్చుంటారని, తమకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. దేశంలోని సామాన్య కాంగ్రెస్‌వాదుల మనోభావాలను ఆయన అర్థం చేసుకోవాలన్నారు.

సోనియా గాంధీ విదేశీయానం

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగవలసిన సమయంలో ఆ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ వైద్య పరీక్షల కోసం విదేశాలకు పయనమవుతున్నారు. ఆ పదవి చేపట్టేందుకు రాహుల్ గాంధీ విముఖత వ్యక్తంచేయడంతో ఏకాభిప్రాయం గల నేతను ఎంపిక చేసేందుకు అన్వేషణ పూర్తి కాలేదు. దీంతో ఎన్నికల షెడ్యూలును ప్రకటించడానికి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ అనుమతి కోసం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం వేచి చూస్తోంది. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికల ప్రక్రియ సెప్టెంబరు 20తో పూర్తి కావలసి ఉంది. సోనియా గాంధీని కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలిగా కొనసాగిస్తూ ప్రతి జోన్‌కు ఓ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను నియమించాలని ఇటీవల ఓ ప్రతిపాదన వచ్చింది. గాంధీయేతరులకు ఆ పదవి ఇవ్వవలసి వస్తే రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్‌లలో ఒకరికి ఇవ్వాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. షెడ్యూల్డు కులాలవారికి ఇవ్వాలనుకుంటే సుశీల్ కుమార్ షిండే, మల్లికార్జున ఖర్గే, మీరా కుమార్ పేర్లను పరిశీలించాలని కొందరు సలహా ఇచ్చినట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పట్ల విధేయత, కర్ణాటక శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఖర్గేకు ఇవ్వాలని మరికొందరు సూచించినట్లు సమాచారం. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయంతో ఆ పార్టీ అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేశారు. ఆ తర్వాత సోనియా గాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీని సమూలంగా ప్రక్షాళన చేయాలని 23 మంది నేతలు లేఖ రాయడంతో తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని సోనియా చెప్పారు. కానీ ఆ పదవిలో కొనసాగాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆమెను కోరింది. ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా తాను కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటానని సోనియా గాంధీ చెప్పారు. రాహుల్ గాంధీ ఆ పదవిని చేపట్టేందుకు తిరస్కరిస్తున్నారు. ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఆ పదవి చేపట్టేందుకు ఆసక్తి ప్రదర్శించడం లేదని తెలుస్తోంది.

బీహార్ అసెంబ్లీ స్పీకర్ రాజీనామా

పాట్నా: ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వం శాసనసభలో బలాన్ని నిరూపించుకోవడానికి ముందు అసెంబ్లీ స్పీకర్ విజయ్ కుమార్ సిన్హా తన పదవికి రాజీనామా చేశారు. జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పదవికి రాజీనామా సమర్పించి ఉండేవాడినని, అయితే తనపై కొందరు తీవ్రమైన ఆరోపణలు చేసినందువల్ల సభలో తన వాదనను వినిపించాలనుకున్నానని విజయ్ తెలిపారు. తనపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం అస్పష్టంగా ఉందని, నిబంధనలకు అనుగుణంగా లేదని విజయ్ తెలిపారు. తొమ్మిది మంది ఇచ్చిన లేఖల్లో ఎనిమిది లేఖలు నిబంధనలకు అనుగుణంగా లేవన్నారు. తాను పక్షపాతంతో, నియంతృత్వంతో వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారని, ఈ ఆరోపణల్లో వాస్తవం లేదని వ్యాఖ్యానించారు. ఎన్డీయే నుంచి జేడీయూ బయటికొచ్చిన తర్వాత ఏర్పడిన నూతన ప్రభుత్వం తన బలాన్ని నిరూపించుకునేందుకు రెండు రోజులపాటు ప్రత్యేకంగా శాసనసభ సమావేశమైంది. ఈ సందర్భంగా స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. కాగా బీహార్ శాసనమండలి చైర్మన్ పదవికి జేడీయూ నేత దేవేశ్ చంద్ర ఠాకూర్ నామినేషన్ దాఖలు చేశారు. ఇదిలావుండగా, మాజీ ఉప ముఖ్యమంత్రి తార్‌కిషోర్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ శాసనసభ సమావేశాలకు తాము హాజరవుతున్నామని చెప్పారు. ఆర్జేడీ నేతల ఇళ్లు, కార్యాలయాలపై సీబీఐ సోదాల గురించి ప్రస్తావిస్తూ సీబీఐ స్వతంత్ర సంస్థ అని, తన పని తాను చేసుకుంటుందని చెప్పారు. ఈ రోజే ఎందుకు సోదాలు చేస్తున్నారో ఆ సంస్థే చెబుతుందన్నారు. బీహార్ శాసనసభ రాజ్యాంగ వ్యవస్థ అన్నారు. శాసనసభ వెలుపల సీపీఐ-ఎంఎల్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ సీబీఐ సోదాల ద్వారా తమను బెదిరించేందుకు జరుగుతున్న కుట్రల వల్ల ఫలితం ఉండదన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు తాము చేసిన ప్రతిపాదనను పరిశీలించి, చర్చించాలన్నారు.

గుజరాత్‌లో అధికారం మాదే: కాంగ్రెస్

అహ్మదాబాద్: గుజరాత్‌లో బీజేపీ పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయావకాశాలు చాలా మెండుగా ఉన్నాయని అంచనా వేశారు. చాలా ఏళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కమలం పార్టీ పాలన చూసి ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులతో 12 గంటల మారథాన్ సమావేశంలో మాట్లాడుతూ కేసీ వేణుగోపాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి, గుజరాత్ ఎన్నికల పరిశీలకుడు అశోక్ గహ్లోత్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గుజరాత్‌లో ఇటీవల కల్తీమద్యం కారణంగా చాలా మంది చనిపోయిన విషయాన్ని కూడా వేణుగోపాల్ ప్రస్తావించారు. డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులు కూడా ఎక్కువయ్యాయని ఆరోపించారు. గుజరాత్ ప్రభుత్వం అవినీతి, అసమర్థంగా మారిందని ధ్వజమెత్తారు. అందుకే గతేడాది మంత్రివర్గం మొత్తాన్ని మార్చారని పేర్కొన్నారు. ఇటీవలే ఇద్దరు బీజేపీ నేతలను మంత్రి పదవుల నుంచి తప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. గుజరాత్‌లో 90 రోజుల ఎన్నికల ప్రచారాన్ని కాంగ్రెస్ బుధవారం ప్రారంభించింది. ఈ సారి ఎన్నికలను చాలా సీరియస్‌గా తీసుకున్నామని, అందరం ఐకమత్యంతో పోరాడుతామని వేణుగోపాల్ తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏమాత్రం ప్రభావం చూపదని అంతా అనుకున్నారని కానీ కొద్ది సీట్ల తేడాతోనే బీజేపీ గెలిచిందని చెప్పారు. ఈసారి బీజేపీపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నందున కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు.

సరిహద్దులో బంగ్లా జాతీయుడి హత్య

జల్పాయ్‌గురి: పశ్చిమ బెంగాల్ రాష్ట్రం జల్పాయ్‌గురి జిల్లా సరిహద్దు గ్రామంలో చొరబడిన బంగ్లాదేశ్‌కు చెందిన దొంగల ముఠా... ఓ ఇంట్లో ఆవులను దొంగిలించడానికి ప్రయత్నించిన ఘటనలో ముఠాలోని వ్యక్తిని స్థానికులు పట్టుకుని చితకబాదడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంగ్లాదేశ్‌కు చెందిన ముఠా మంగళవారం రాత్రి దేశంలోకి చొరబడిందని, రాజ్‌గంజ్ బ్లాక్, కుకుర్జన్ ప్రాంతంలోగల బారువా పారాలోని ఓ ఇంట్లో ఆవులను దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండగా అప్రమత్తమైన స్థానికులు వారిని వెంబడించగా దొంగల ముఠా సభ్యులంతా తిరిగి బంగ్లాదేశ్‌లోకి వెళ్లగలిగారు కానీ దొంగల్లో ఒకరు సరిహద్దు దాటలేక సమీపంలోని తేయాకు తోటలోకి పారిపోయారని చెప్పారు. రాత్రంతా అతని కోసం వేచి చూసిన స్థానికులు, తెల్లవారుజామున అతడిని పట్టుకుని కొట్టి చంపినట్లు పోలీసులు తెలిపారు. మృతుడ్ని ఎండీ సలాంగా గుర్తించారు. అతను ఉత్తర బంగ్లాదేశ్‌లోని రంగ్‌పూర్ డివిజన్ పంచగర్ జిల్లాకు చెందినవాడని పేర్కొన్నారు. కాగా ఈ హత్యకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా బంగ్లాదేశ్ ముఠా దాడిచేసిన ఇంటి యజమాని నృపెన్‌రాయ్ మాట్లాడుతూ.. దొంగల ముఠాను వెంబడించడంతో, ఒకరు తప్ప ముఠా సభ్యులంతా ఆవులను వదిలి సరిహద్దు దాటి పారిపోయారని, అతడ్ని స్థానికులు కొట్టి చంపినట్లు తెలిపారు. ఇంతకు ముందు కూడా మా వూరి నుంచి ఆవులను దొంగిలించారని తెలిపారు.

ఈడీ సోదాలు: రెండు ఏకే-47 రైఫిళ్లు స్వాధీనం

రాంచీ: జార్ఖండ్‌లో అక్రమ గనుల తవ్వకం, దోపిడీ కేసుకు సంబంధించి ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సన్నిహితుడైన ప్రేమ్ ప్రకాశ్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు చేపట్టింది. రాంచీ నగరం హర్మూ హౌసింగ్ కాలనీలోని ప్రేమ్ ప్రకాష్ అద్దె ఇంటిలోని అల్మారాలో ఉంచిన రెండు ఏకే-47 అసాల్ట్ రైఫిళ్లను 60 బుల్లెట్లను, రెండు మ్యాగజైన్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత, జార్ఖండ్ పోలీస్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుంది. ఏకే-47 ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్‌కు చెందినదని పేర్కొంది. అయితే విచారణ పూర్తయిన తర్వాతే ఆయుధాలను పోలీసులకు అప్పగిస్తామని ఈడీ తెలిపింది. అక్రమ గనుల తవ్వకం ఆరోపణలపై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా బుధవారం రాంచీలోని వివిధ ప్రాంతాల్లో ఈడీ దాడులు చేసింది. కాగా జార్ఖండ్, బీహార్, తమిళనాడు, ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లోని 17-20 ప్రాంతాల్లో కూడా సోదాలు జరిగినట్లు పీటీఐ నివేదించింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ రాజకీయ సహాయకుడు పంకజ్ మిశ్రా, మిశ్రా సహచరుడు బచ్చు యాదవ్‌లను ప్రశ్నించిన నేపథ్యంలో తాజా సమాచారం వెలుగులోకి రావడంతో ఈడీ సోదాలు నిర్వహించినట్లు పీటీఐ తెలిపింది. ఈ కేసులో ఇంతకుముందు మిశ్రా, యాదవ్‌లను ఈడీ అరెస్టు చేసింది.

తమిళనాడు పథకాలకు రాష్ట్రపతి ప్రశంస: స్టాలిన్

కోయంబత్తూరు: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు డీఎంకే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను అనుకరించేందుకు ప్రయత్నిస్తున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. లక్ష మందికి పైగా లబ్ధిదారులు సంక్షేమ పథకాలను అందుకున్న సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో స్టాలిన్ ప్రసంగిస్తూ.. తమిళనాడులో అమలవుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్ర అభివృద్ధిని ఇటీవల దిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపాధ్యక్షుడు జగదీప్ ధన్‌కర్ ప్రశంసించడం తనకు గర్వకారణమని అన్నారు. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకేను పరోక్షంగా విమర్శిస్తూ... తమిళనాడులోని కొన్ని పార్టీలు రాష్ట్ర ప్రజలు ఆమోదించిన, ప్రశంసిస్తున్న పథకాలను ఎప్పుడూ విమర్శించడానికి ప్రయత్నిస్తాయని స్టాలిన్ అన్నారు. తీవ్ర అంతర్గత సమస్యలను ఎదుర్కొంటున్న ఆ పార్టీకి ఇది నిరాశ తప్ప మరొకటి కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రూ.663 కోట్లతో 748 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయగా, రూ.272 కోట్లతో పూర్తయిన 229 పథకాలను ప్రారంభించారు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కోయంబత్తూరు ప్రయోజనాల కోసం గత 15 నెలల్లో అమలు చేసిన ప్రాజెక్టులు, పథకాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టు నివేదిక సిద్ధమైందని, నగరంలోని అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. 'నాకు ప్రజల నుండి ప్రశంసలు కావాలి. ఈ సభకు వచ్చినవారి ముఖాలు భవిష్యత్ ఎన్నికల ఫలితాలను ప్రతిబింబిస్తాయి' అని స్టాలిన్ అన్నారు. తాను విమర్శలను ఎదుర్కొంటూ జీవితంలో ఎదిగానని, తమిళనాడులో ఎవరినీ సమస్యలు సృష్టించడానికి అనుమతించబోనని చెప్పారు. ఆత్మగౌరవం లేని వారు అణగారిన వర్గాల పక్షాలన నిలబడిన అధికార పార్టీని విమర్శిస్తున్నారని అన్నారు.

లాక్‌డౌన్ వేళ కూలీలను ఆదుకున్న

రైతు ఆత్మహత్య

న్యూదిల్లీ: కోవిడ్ వేళ ఉన్నపళంగా లాక్‌డౌన్ విధిస్తే తన వద్ద పనిచేసే కూలీలను విమానం ఎక్కించి ఇంటికి పంపించి యావత్ దేశం ప్రశంసలు అందుకున్న దిల్లీ రైతు 'పప్పన్‌సింగ్ గెహ్లాట్' ఆత్మహత్య చేసుకున్నారు. 55 ఏళ్ల వయసున్న ఆయన దిల్లీలోని అలీపోర్ ప్రాంతంలో తన ఇంటి ముందున్న దేవాలయంలో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. బుధవారం ఉదయం దిల్లీ పోలీసులు ఆయన మృతదేహాన్ని గుర్తించారు. దేవాలయంలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో ఓ సూసైడ్ లేఖ లభ్యమైందని, అనారోగ్యంతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు అందులో పేర్కొన్నారని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించామని, తదుపరి దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు. పప్పన్ సింగ్ గెహ్లాట్ ఎప్పుడూ ఉత్సాహంగా కనిపించేవారు. పుట్టగొడుగులు సాగు చేసిన ఆయన.. తన వద్ద పనిచేసే కూలీలతో ఉల్లాసంగా గడిపేవారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో దేశవ్యాప్తంగా వలస కార్మికులు పడరాని కష్టాలు పడ్డారు. రవాణా వ్యవస్థ మూతపడటంతో ఎంతోమంది వందలాది కిలోమీటర్లు నడిచి స్వగ్రామాలకు చేరుకున్నారు. కానీ పప్పన్ సింగ్ గెహ్లాట్ మాత్రం తన కూలీలను అక్కున చేర్చుకున్నారు. అందరికీ విమాన టికెట్లు కొనుగోలు చేసి.. దగ్గరుండి విమానం ఎక్కించి బీహార్‌లోని వారి స్వస్థలాలకు పంపించారు. కోవిడ్ పరిస్థితులు మెరుగయ్యాక తిరిగి మళ్లీ విమానంలోనే వారిని దిల్లీకి తీసుకెళ్లడం ఆయన మంచితనానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది.

ఐదారేళ్లలో బీజేపీ అంతం తథ్యం

ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే కరీముద్దీన్

గుహవతి: వచ్చే ఐదు నుంచి ఆరేళ్లలో అస్సాంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అంతమైపోతుందని ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) ఎమ్మెల్యే కరీముద్దీన్ బర్భూయా అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీహార్ లో జరిగిన పరిణామాలు బీజేపీ పతనానికి నాంది అని అన్నారు. ప్రజలు మళ్లీ ఆ పార్టీని అంగీకరించబోరని తెలిపారు. అసాంలోని సోనాయ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్న బర్భూయా... తమ పార్టీ బలోపేతం అవుతోందని చెప్పారు. కాంగ్రెస్ అసోం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బార్‌పేట జిల్లా అధ్యక్షుడితో పాటు అనేకమంది కాంగ్రెస్ నాయకులు సెప్టెంబర్ 2వ తేదీన ఏఐయూడీఎఫ్‌లో చేరబోతున్నారని చెప్పారు. ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ మాట్లాడుతూ... అసోం నుంచి బీజేపీని తమ పార్టీ తొలగిస్తుందని అన్నారు. అసోం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నుండి రిపున్ బోరా వైదొలగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రాబల్యం కోల్పోతున్నందున ఏఐయూడీఎఫ్ పుంజుకోవాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వారితోపాటు అనేకమంది కాంగ్రెస్ నేతలు వచ్చే నెలలో పార్టీలో చేరతారని తెలిపారు.

బిల్కిస్ బానో దోషులకు ఘన స్వాగతం తప్పే

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

ముంబై: బిల్కిస్ బానోపై అత్యాచారానికి పాల్పడిన 11 మంది దోషులు జైలు నుంచి విడుదలైన తర్వాత వారికి ఘన స్వాగతం పలకడాన్ని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా విమర్శించారు. 11 మంది దోషులు గోధ్రా జైలులో శిక్ష అనుభవిస్తుండగానే స్వాతంత్ర్య దినోత్సవం రోజున గుజరాత్ ప్రభుత్వం వారిని విడుదల చేసింది. అయితే వారికి పూలదండలు వేసి మిఠాయిలు పంచుతూ ఘన స్వాగతం లభించింది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం అయ్యింది. దోషుల సంబరాలపై దేశ వ్యాప్తంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే దేవేంద్ర ఫడ్నవీస్ కూడా స్పందించారు. దోషులకు సన్మానాన్ని సమర్థించలేమని, ఇది తప్పని ఆయన అన్నారు. '2002 నాటి బిల్కిస్ బానో కేసులో దోషులు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విడుదల య్యారు. అయితే నేరానికి పాల్పడిన వ్యక్తిని సత్కరిస్తే అది కచ్చితంగా తప్పే. అలాంటి చర్యకు ఎలాంటి సమర్థనా ఉండదు 'అని ఆయన అన్నారు. బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం, హత్య కేసులో 11 మంది దోషులకు ముంబైలోని ప్రత్యేక కోర్టు జీవిత ఖైదు విధించింది. తర్వాత బాంబే హైకోర్టు శిక్షను సమర్థించింది. దోషులలో ఒకరు ఉపశమనం కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రిమిషన్‌ను కోర్టు ఆమోదిం చింది. దీంతో స్వాతంత్ర్య దినోత్సవం రోజున గుజరాత్ ప్రభుత్వం 11 మంది ఖైదీలను విడుదల చేయాలని ఆదేశించింది.గోధ్రా జైలు నుంచి విడుదలైన అనంతరం ఖైదీలకు పూలమాలలు వేసి మిఠాయిలు పంచుతూ స్వాగతం పలికారు. అయితే రిమిషన్‌ను సవాల్ చేస్తూ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రూపరేఖ వర్మ తరఫున మూడు పిటిషన్లు దాఖలు అయ్యాయి. అయితే వీటిని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. మినహాయింపు నిర్ణయాన్ని పునసమీక్షించాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

బీజేపీలో గడ్కరీ వ్యాఖ్యల దుమారం



ముంబై: బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజా వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. కీలక పార్లమెంటరీ కమిటీ నుంచి ఆయన్ని తప్పించిన తర్వాత రాజకీయ వర్గాల్లో విస్తృతస్థాయి చర్చ నడిచిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం సకాలంలో నిర్ణయాలు తీసుకోవట్లేదని, అదో పెద్ద సమస్యగా మారిందని గడ్కరీ చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు విశ్లేషణ మొదలైంది. గత ఆదివారం సాయంత్రం ముంబైలో నాట్కోన్ 2022 కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి గడ్కరీ మాట్లాడుతూ... భారత మౌలిక సదుపాయాల భవిష్యత్తు చాలా ప్రకాశవంతమైందని పేర్కొన్నారు. అద్భుతాలు చేయొచ్చునని, ఆ సామర్థ్యం భారత్‌కు ఉందని, అందుకు మంచి సాంకేతికతను అంగీకరించాల్సి ఉంటుందని చెప్పారు. ఖర్చు తగ్గించుకోవడానికి ప్రత్యామ్నాయాలను పాటించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే నిర్మాణంలో అత్యంత ముఖ్యమైన విషయం... సమయం అన్నారు. సమయం అనేది అతిపెద్ద పెట్టుబడి అంటూ మన ప్రభుత్వం సకాలంలో నిర్ణయాలు తీసుకోకపోవడమే పెద్ద సమస్యగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. కీలక నిర్ణయాల విషయంలో ప్రభుత్వం తీరు మారకపోతే, ఎన్ని ప్రకటనలు చేసుకున్నా వ్యర్థమేనని, అభివృద్ధి ముందుకెళ్లదని విమర్శించారు. దీంతో సొంత పార్టీని లక్ష్యంగా చేసుకునే గడ్కరీ ఆ విధంగా అని ఉంటారన్న చర్చ బీజేపీలో నడుస్తోంది. మరోవైపు ఆయన వ్యాఖ్యలు సాధారణమైనవేనని మరికొందరు అంటున్నారు.

మోదీ వ్యాఖ్యల అనంతరం...

తన పాలనను స్వర్ణ యుగంగా అభివర్ణించుకున్న ప్రధాని మోదీ... ఎన్నో మైలు రాళ్లను దాటిందంటూ చెపుకున్నారు. అయితే ఈ వ్యాఖ్యల తర్వాత నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నితిన్ గడ్కరీ మాట్లాడుతూ... గతంతో పోలిస్తే ఇప్పటి రాజకీయాల తీరు మారిందని, వాటిని చూస్తుంటే కొన్ని సమయాల్లో రాజకీయాలను వదిలేయాలని ఉందని వ్యాఖ్యానించారు. అయితే ఆ వ్యాఖ్యలు దుమారం రేపడంతో కొన్నిగంటలకే ఆయన తన ప్రకటనను సవరిస్తూ మరోసారి మాట్లాడినప్పటికీ ఆ మాటలు కూడా చర్చనీయాంశంగానే మారాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి, చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉండడానికి, రాజకీయాల్లో ఈ స్థానంలో ఉండడానికి వాజ్‌పేయి, అద్వానీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ లాంటి వాళ్ల కృషి ఉందని పేర్కొన్నారు. 1980లో వాజ్‌పేయి చేసిన ప్రసంగాన్ని ఉటంకిస్తూ... చీకట్లు తొలగి పోయి, సూర్యుడు ఉదయిస్తాడు. కమలం వికసిస్తుందన్న వ్యాఖ్యలను గడ్కరీ ప్రస్తావించారు. గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేసిన కొన్నాళ్లకే కీలక బీజేపీ పార్లమెంటరీ బోర్డు నుంచి ఆయన్ని తప్పించడం గమనార్హం. ఆరెస్సెస్ మూలాలున్న మహారాష్ట్రకు చెందిన గడ్కరీ, గతంలో బీజేపీ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. దిల్లీ కంటే సొంత నియోజక వర్గంలోనే ఎక్కువగా గడిపే గడ్కరీకి జనాదరణతో పాటు పార్టీలకతీతంగా అభిమానులు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణ, ఆధ్యాత్మిక బంధం

అమృతా ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

ఫరీదాబాద్ / మొహాలీ: భారతదేశంలో ఆరోగ్య సంరక్షణకు, ఆధ్యాత్మికతకు దగ్గర సంబంధం ఉందని ప్రధాని మోదీ చెప్పారు. ఆధ్యాత్మిక-ప్రైవేటు భాగస్వామ్యంలో కోవిడ్ వాక్సినేషన్ విజయవంతం అయిందని ఆయన అన్నారు. మోదీ బుధవారం 2,600 పడకల ప్రైవేటు ఆసుపత్రిని హరియాణాలోని ఫరీదాబాద్‌లో, 300 పడకల హోమీ బాబా కాన్సర్ ఆసుపత్రిని పంజాబ్‌లోని మొహాలీలో ప్రారంభించారు. ఆయా సందర్భంగా ప్రసంగిస్తూ ఇది అమృత కాలం అని అన్నారు. జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో ఆరోగ్య సంరక్షణ మౌలిక వసతులను పెద్దఎత్తున పెంపొందించేలా కట్టింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో పాటు సెంట్రలైజ్డ్ ఆటోమేటెడ్ ల్యాబ్‌తో అమృతా ఆసుపత్రి నిర్మాణం జరిగింది. ఆసుపత్రిని 130 ఎకరాల విస్తీర్ణంలో విశాలంగా నిర్మించారు. ఏడు అంతస్తుల రీసర్చ్ బ్లాక్ ఉంది. ఆరు ఏళ్ల పాటు మాతా అమృతానందమయి మఠ్ పరివేక్షణలో ఈ నిర్మాణం జరిగింది. ఆధ్యాత్మిక గురువు మాతా అమృతనందమయి వేదికపై మోదీ మీద పూలు చల్లి, శాలువాతో సన్మానించారు. మాతా ఆశీస్సులతో అమృతాన్ని భారత్ పొందుతోందని మోదీ అన్నారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద వాక్సినేషన్ డ్రైవ్ భారత్‌లో అమలు అయింది. కొందరు తప్పుడు ప్రచారం చేయాలని చూశారుగానీ మన ఆధ్యాత్మిక గురువులు జోక్యం చేసుకోవడంతో ప్రజలు వాక్సిన్ తీసుకునేందుకు ముందుకు వచ్చారు. సాంకేతికత, ఆధునికత కలగలుపుగా ఆరోగ్యసంరక్షణ రంగంలో భారత్ పురోగతి సాగిస్తోంది. ఆరోగ్యం, విద్యా రంగాలు మిషన్ మోడ్‌లో కొనసాగుతున్నాయి' అని మోదీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ముఖ్యమంత్రి మనోహర్ లాల్ కట్టర్ పాల్గొన్నారు. 'నేడు ప్రారంభించినది ఆసుపత్రి మాత్రమే కాదు.. పేదలకు సేవ చేయాలన్న యజ్ఞం. కేంద్రప్రభుత్వ స్వస్త్ భారత్ మిషన్‌ను ఈ ఆసుపత్రి ముందుకు తీసుకు వెళుతుంది' అని కట్టర్ అన్నారు. ఈ మల్టీ సెస్పాలిటీ ఆసుపత్రిలో 500 పడకలు ప్రస్తుతం అందుబాటులోకి రాగా వచ్చే ఐదేళ్లలో దశలవారీగా పూర్తిస్థాయిలో అన్ని వసతులు అందుబాటులోకి వస్తాయి. మొత్తం 81 స్పెషాలిటీలతో కూడిన ఈ ఆసుపత్రిని 36 చదరపు లక్షల విస్తీర్ణంలో 14 అంతస్తుల భవనంగా నిర్మించారు. పైకప్పుపై హెలీప్యాడ్ ఉంది. ఇదిలావుంటే, పంజాబ్‌లోని మొహాలీ జిల్లాలో హోమీ బాబా కాన్సర్ ఆసుపత్రి, పరిశోధన కేంద్రాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. చండీగఢ్ శివార్లలోని ముల్లాన్‌పూర్‌లో ఈ ఆసుపత్రి ఉంది. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పాల్గొన్నారు. 300 పడకలు, ఎంఆర్ఐ, మామ్మోగ్రఫీ, డిజిటల్ రేడియోగ్రఫీ, బ్రాచీథెరపితో పాటు కీమో-ఇమ్యునో థెరపీ, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటివి ఉన్నాయి. టాటా మెమోరియల్ ఆధ్వర్యంలో రూ.660 కోట్లతో ఈ ఆసుపత్రిని నిర్మించింది. పంజాబ్‌తో పాటు జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, ఉత్తరాఖండ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు చెందిన రోగులకు వైద్యసేవలు అందిస్తుంది.

ప్రజలకు ఆ స్వేచ్ఛ ఉండాలి: విజయన్

తిరువనంతపురం: కేరళ ప్రభుత్వ లింగ-తటస్థ (జెండర్ న్యూట్రల్) విధానంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పిల్లలు పాఠశాలలకు ఎలాంటి యూనిఫారం ధరించాలో వామపక్ష ప్రభుత్వం నిర్ణయించబోదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం అన్నారు. బాలబాలికలకు ఎలాంటి యూనిఫారాలు ఉండాలన్నది నిర్ణయించే ప్రత్యేక అధికారం విద్యాసంస్థలకు ఉంటుందని తెలిపారు. లింగ-తటస్థ విధానాన్ని, ముఖ్యంగా యూనిఫారాలకు సంబంధించి, కాంగ్రెస్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, వివిధ సంప్రదాయవాద ముస్లిం మత సంస్థల నాయకులు విమర్శించారు. ప్రతి ఒక్కరినీ విశ్వాసంలోకి తీసుకుని ప్రభుత్వం మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు లింగ న్యాయం, సమానత్వం కల్పించాలని ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యే కేకే శైలజ చేసిన వినతిపై సీఎం స్పందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు ఒకే రకమైన యూనిఫారాలు అమలు చేసే ఉద్దేశం లేదన్నారు. ఆయా విద్యాసంస్థలు, వాటి ఉపాధ్యాయులు, పీటీఏ, విద్యార్థి ప్రతినిధులు చర్చించి తగిన యూనిఫామ్‌లపై నిర్ణయం తీసుకుని వాటిని అమలు చేయాలని ఆయన సూచించారు. వస్త్రధారణ, ఆహారం, మతవిశ్వాసం వంటివాటిపై ప్రజలకు స్వేచ్ఛ ఉంటుందని విజయన్ నొక్కిచెప్పారు.

కాంగ్రెస్‌కి మరో నేత గుడ్‌బై

న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీకి మరో కీలక నేత గుడ్‌బై చెప్పారు. జాతీయ అధికార ప్రతినిధి జైవీర్ షెర్గిల్ పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేశారు. పార్టీ అధిష్ఠానం భజనపరుల కోటరీగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కోసం పార్టీ పాటుపడే పరిస్థితి కనిపించలేదని రాజీనామా అనంతరం వ్యాఖ్యానించారు. ఎనిమిదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అంకితమై పనిచేశానని, తాను పార్టీ నుంచి తీసుకున్నదేమీలేదని ఆయన స్పష్టం చేశారు. అధిష్ఠానం అడుగులకు మడుగులొత్తే వారికి అందలాలు దక్కుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిగా పార్టీ అధినేత్రి సోనియా గాంధీతో పాటు రాహుల్‌గాంధీ, ప్రియాంక వాద్రా సమయం కోరుతున్నా తనను కార్యాలయానికి పిలవలేదని ఆయన వాపోయారు. కాంగ్రెస్ పార్టీ వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోలేకపోతోందని జైవీర్ షెర్గిల్ చెప్పారు. జాతీయ మీడియాలో హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అధికార ప్రతినిధిగా పార్టీ అభిప్రాయాలను బలంగా వినిపించే నేతగా పేరున్న జైవీర్ షెర్గిల్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పడం సంచలనం రేపుతోంది. సుప్రీంకోర్టు న్యాయవాదిగానూ మంచిపేరు తెచ్చుకున్న షెర్గిల్ పార్టీని వీడటం కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. జైవీర్ షెర్గిల్ ఏ పార్టీలో చేరతారనేది ఇంకా స్పష్టం కాలేదు. జ్యోతిరాదిత్య సింధియా, ఆర్పీ సింగ్, జితిన్ ప్రసాద, హార్దిక్ పటేల్, కపిల్ సిబల్ తదితరులు వరుసగా పార్టీని వీడటం కాంగ్రెస్‌లో గుబులు రేపుతోంది.

అంబరాన్నంటిన ప్రచారం

- విశాఖ చుట్టూ గోడరాతలు
- ప్రతి ఇంటా కరపత్రాలు
- మారుమూల ప్రాంతాలకు గోడపత్రికలు
- బ్యానర్లు, తోరణాలతో అలంకరణ
- ప్రతినిధులకు ప్రత్యేక వసతి, భోజన ఏర్పాట్లు
- సీపీఐ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లలో ఆహ్వాన సంఘం తలమునకలు

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఈ నెల 26, 27, 28 తేదీల్లో విశాఖ నగరంలో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర 27వ మహాసభల ప్రచారం అంబరాన్నంటింది. ఆహ్వాన సంఘం సమావేశాల్లో సమిష్టిగా తీసుకున్న నిర్ణయాలను వ్యక్తిగత బాధ్యతగా భుజాన వేసుకున్న పార్టీ నాయకత్వం, కార్యకర్తలు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. నగరం చుట్టూ గోడ రాతలు పూర్తయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు గోడపత్రికలను తరలించారు. నేతలు, కార్యకర్తల ఇళ్లముందు, ఆటో స్టాండ్లు తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా రూపొందించిన వేలాది బ్యానర్లు ఏర్పాటు చేశారు. పధాన కూడళ్లలో ప్రైవేటు ప్రకటనదారుల సహకారంతో హోర్డింగుల ద్వారా మహాసభల సమాచారంతో రూపొందించి భారీ బ్యానర్లను ఏర్పాటు చేశారు. గుడ్డతో తయారు చేసిన రెండు లక్షల తోరణాలతో ప్రధాన కూడళ్లను అలంకరించడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి ఇంటికి మహాసభల సమాచారం చేరేలా 2 లక్షల కరపత్రాలు అచ్చువేయించి వివిధ పద్ధతుల్లో పంపిణీ చర్యలు చేపట్టారు. పార్టీ సభ్యులతో పాటు విద్యార్థి, యువజన, మహిళా సంఘాల కార్యకర్తలు నగరమంతా పర్యటిస్తూ కరపత్రాలు పంచుతూ మహాసభల ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. తొలిరోజు నిర్వహించే ర్యాలీలో కార్యకర్తల కోసం 10 వేల జెండాలు, వెయ్యి టీషర్టులు సిద్ధం చేయించారు. 26న మధ్యాహ్నం 3 గంటలకు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్న తరుణంలో ప్రజానాట్యమండలి కళాకారులతో పాటు ఉత్తరాంధ్ర కళారూపాలైన థింసా, కోలాటం, తప్పిటగుళ్ల కళాకారులు ర్యాలీలో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. వర్షం కురిస్తే బహిరంగసభకు ఎటువంటి ఆటంకం కలుగకుండా వేలాది మందికి సరిపడేలా ప్రముఖ రైతు నేత కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు పేరుతో సభా ప్రాంగణాన్ని (సిరిపురం జంక్షన్ వద్దనున్న గురజాడ కళాక్షేత్రం) ఎంపిక చేసి అక్కడ అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే ప్రతినిధులకు వసతి ఏర్పాట్లను కమిటీ పూర్తి చేసింది. 27, 28 తేదీల్లో నిర్వహించనున్న సభలకు కార్మికోద్యమ నేత కామ్రేడ్ గురుదాస్ దాస్ గుప్తా పేరుతో ఏర్పాటు చేసిన ప్రతినిధుల సమావేశ మందిరంలో (సిరిపురం జంక్షన్ సమీపంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా) అవసరమైన ఏర్పాట్లును సీనియర్ నేతలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. సీపీఐ మాజీ ఎమ్మెల్యే వంకా సత్యనారాయణ పేరుతో భోజనశాల, ఎటువంటి అసౌకర్యం కలుగకుంగా ప్రత్యేక భోజన కౌంటర్లను ఏర్పాటు చేశారు. 50 మంది రెడ్ షర్ట్ వలంటీర్ల బృందం ప్రతినిధులకు సహాయ సహకారాలు అందించనున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విశాఖ చేరుకునే ప్రతినిధుల కోసం ఒక రోజు ముందుగానే వసతి ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి సమావేశ మందిరం వద్దకు చేర్చేలా ప్రయాణ సౌకర్య కల్పనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వైద్య సహాయం అందించేలా ప్రముఖ డాక్టర్ల పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టారు. మహాసభల ఏర్పాట్లలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏజే స్టాలిన్, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. సత్యాంజనేయ, ఏ విమల, కె. సత్యనారాయణ, జీ రాంబాబు, ఎస్‌కే రెహమాన్, ఆర్. శ్రీనివాసరావు, పి. చంద్రశేఖర్, సీఎన్ క్షేత్రపాల్, . సీనియర్ నేతలు అచ్యుతరావు, సుబ్బరాజు, సుకుమారన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు. నాగరాజు, జీ ఫణీంద్ర, ఎస్.మురళి, అన్వేషి, శ్రీను భాగస్వాములయ్యారు.

సీనియర్ నేత వెంకటరత్నం రూ.50 వేల చెక్కు అందజేత

విశాలాంధ్ర-గన్నవరం: సీపీఐ 24వ జాతీయ మహాసభలు విజయవంతం కావాలని కోరుతూ ఎస్టీయూ ఉమ్మడి. రాష్ట మాజీ అధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు పెద్ది వెంకటరత్నం, ఆయన కుటుంబ సభ్యులు 50,000 రూపాయల చెక్కును సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరవు, గన్నవరం ఇన్‌చార్జి కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషికి బుధవారం అందజేశారు. పెద్ది వరలక్ష్మి, పెద్ది అనిత, కట్టవరపు విజయరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐజేయూకు నామినేషన్లు

అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జనరల్‌గా బల్విందర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఐజేయూ అధ్యక్ష స్థానానికి కె.శ్రీనివాసరెడ్డి, సెక్రెటరీ జనరల్ స్థానానికి బల్విందర్ సింగ్ జమ్మూ బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ కార్యాలయంలో సెంట్రల్ రిటర్నింగ్ అధికారి ఎం.ఎ.మాజిద్‌కు వారు తమ నామినేషన్లను అందచేశారు. 11 రాష్ట్రాలకు చెందిన యూనియన్ నాయకులు వారిద్దరినీ అభ్యర్థులుగా బలపరుస్తూ 11 సెట్ల నామినేషన్ల పై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఐజేయూ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. నామినేషన్ల దాఖలుకు ఆగస్టు 25 తుదిగడువు కాగా, ఉపసంహరణకు సెప్టెంబర్ 5 చివరి తేదీ. ఇతర నామినేషన్లు లేనిపక్షంలో వీరిద్దరినీ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు 5వ తేదీన అధికారికంగా ప్రకటిస్తారు.

సీఎం వినతులపై కేంద్రంలో కదలిక

నేడు రాష్ట్ర సమస్యలపై దిల్లీలో భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోదీతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భేటీపై కేంద్రంలో కొంత కదలిక వచ్చింది. ఏపీకి సంబంధించిన పోలవరం, రీసోర్స్ గ్యాప్ కింద నిధులు, విభజన హామీలు, ప్రత్యేక హోదా తదితర అంశాలపై ప్రధానికి సీఎం వినతి పత్రం అందజేసిన విషయం తెల్సిందే. దీనిలో భాగంగా ఏపీ సమస్యల పరిష్కారానికి ప్రధాని ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు.

ఈ మేరకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి స్వామినాథన్ కమిటీ నేతృత్వంలో నార్త్ బ్లాక్‌లో సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి ఏపీ ప్రభుత్వ ప్రతినిధుల బృందం తరపున డెలిగేషన్ చైర్మన్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి, వైస్ చైర్మన్‌గా ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

అధ్వాన పాలన చేస్తున్నారు

బీజేపీ, వైసీపీలను గద్దె దింపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై ఓబులేసు, వనజ, చలసాని తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ అసమర్థ పాలకులుగా ముద్ర వేసుకున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం ఏలూరు నగరంలో సీపీఐ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభల ప్రతినిధుల సభ రెండవ రోజు శ్రీ కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో ప్రారంభం అయింది. తొలుత సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఐ చింతలపూడి నాయకులు బొడా వజ్రం మృత వీరుల స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సన్నేపల్లి సాయిబాబ, తుర్లపాటి బాబు, కొండేటి బేబి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. గత మహాసభ నుంచి ప్రస్తుత మహాసభ వరకు మరణించిన నాయకులకు, సభ్యులకు సంతాపం తెలియజేస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో రామకృష్ణ మాట్లాడుతూ హిట్లర్ సిద్ధాంతం, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఒకటేనన్నారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత అశాస్త్రీయమైన విధానాలు అవలంబిస్తున్నారని విమర్శించారు. ఉపాధి కోసం వలసలు వెళ్లిన 12 కోట్ల మంది కరోనా కష్టకాలంలో తిరిగి రావడానికి అవకాశం ఇవ్వకుండా లాక్ డౌన్ ప్రకటించారన్నారు. కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కరోనాను సమర్థవంతంగా ఎదుర్కొన్నారని తెలిపారు. ఇతర దేశాలలో ఉన్న కమ్యూనిస్టు ప్రభుత్వాలు తమ దేశంలో ఉన్న వైద్యులను విదేశాలకు పంపి సేవలు అందజేశారని తెలిపారు. భారతదేశంలో కరోనా మరణాలకు లెక్కలు లేవన్నారు. చైనాకు, భారత్‌కు సంవత్సరం తేడాతో స్వాతంత్ర్యం సిద్ధించిందని, 75 సంవత్సరాల స్వాతంత్ర్య కాలంలో మన దేశం 3.3 ట్రిలియన్ డాలర్ల ఆదాయంతో ఉండగా చైనా 16 ట్రిలియన్ డాలర్ల ఆదాయంతో అమెరికాతో పోటీ పడుతూ ప్రపంచ దేశాలను శాసిస్తుందన్నారు. మోదీ, అమిత్ షా పాలనలో కులాలు, మతాలు లెక్కలు వేస్తూ ఓట్ల కోసం సరికొత్త ప్రణాళికలతో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్ఎస్ఎస్ అజెండా అమలు చేస్తుందన్నారు. రాజకీయ పార్టీలను, నాయకులను భయభ్రాంతులకు గురి చేస్తూ అధ్వాన పాలన చేస్తున్నారని విమర్శించారు. ఆర్టికల్ 370ని రద్దు చేశారన్నారు. బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు.

జగన్ పాలనను గాలికొదిలేశారు...

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ పాలనను గాలికి వదిలేశారని రామకృష్ణ ధ్వజమెత్తారు. జగన్ తన పాదయాత్రలో మద్య నిషేధాన్ని అమలు చేస్తానని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సంవత్సరం 20 శాతం మద్యం షాపులు తగ్గిస్తానని వాగ్దానం చేశారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత నిషేధం పేరుతో జగన్ బ్రాండ్లను విక్రయిస్తున్నారని ఆరోపించారు. తన మద్యం బ్రాండ్ల అమ్మకాల ద్వారా రూ.6 వేల కోట్ల ఆదాయాన్ని సంపాదించారని తెలిపారు. రాష్ట్రంలోని సంపదను అదానికి దోచిపెడుతున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ పై రూ.10 పన్ను వేసి సంవత్సరం అంతా వసూలు చేసి ఆటోవాలాలకు రూ.10 వేలు వేస్తున్నారని అన్నారు. అయితే రాష్ట్రంలో తొమ్మిది లక్షల ఆటోవాలాలు ఉంటే ప్రభుత్వం 2 లక్షల 50 వేల ఆటోలకు మాత్రమే రూ.10 వేలు వేస్తోందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని, బలమైన పోరాటాల ద్వారా సీపీఐ శ్రేణులు కలుషిత రాజకీయాలను రూపుమాపాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీలు బలపడటానికి సరైన అవకాశం వచ్చిందని, ప్రజల భావన మార్చాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ప్రత్యామ్నాయ ప్రభుత్వం తేవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర 27వ మహాసభలు ఈనెల 26, 27, 28 తేదీలలో విశాఖలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, విశాఖకు ఉక్కు గంగవరం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, రైతాంగ, ఉద్యోగ, కార్మిక సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జాతీయ మహాసభలు అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు విజయవాడలో జరుగుతాయని, ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు పోకడలను ఎదుర్కోవడం ప్రధాన అజెండాగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర, జాతీయ మహాసభలలో సీపీఐ శ్రేణులు, ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రతినిధుల సభలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ, కార్యవర్గ సభ్యులు చలసాని వెంకట రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్, పుప్పాల కన్నబాబు, మన్నవ కృష్ణ చైతన్య, బత్తుల వెంకటేశ్వరరావు, కారం దారయ్య, సోదెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రిటైరయ్యే వ్యక్తికి విలువ లేదు: సీజేఐ రమణ

న్యూఢిల్లీ: మన దేశంలో పదవీ విరమణ పొందబోతున్నా లేక పొందిన వ్యక్తికి ఏ విలువ ఉండదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణ బుధవారం అన్నారు. ఎన్నికల సమయాల్లో రాజకీయ పార్టీలు ప్రకటించే ఉచితాల నేపథ్య కేసును జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో పాటు ఆయన విచారించారు. ఈ సందర్భంగా పై వ్యాఖ్యలు చేశారు.

వ్యవసాయాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసి వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆగస్టు 21, 22 తేదీలలో మైలవరంలో జరిగిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభలో జిల్లాలోని ప్రధాన సమస్యలను చర్చించి వివిధ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని సీపీఐ కార్యాలయం దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 4లక్షల పది వేల ఎకరాలకు సాగునీరు, 410 గ్రామాలలో 21 లక్షల మందికి తాగు నీరందించాలనే లక్ష్యంతో నిర్మాణం చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సరిపడా నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. మెట్టప్రాంతమైన ఈ జిల్లాలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫ్లోరైడ్ నీటి వల్ల కిడ్నీ వ్యాధులకు గురవతున్న ప్రజలకు మంచినీరు అందించడానికి మంచి నీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలిచ్చి ఆ భూములపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను త్వరగా మౌలిక సదుపాయాలు కల్పించి, అదనంగా ఎలాంటి ఆర్థికభారాలు మోపకుండా లబ్దిదారులకు స్వాధీనపర్చాలన్నారు. మైలవరం, రెడ్డిగూడెం మండ లాల్లో మామిడి జ్యూస్ పరిశ్రమను, జి.కొండూరు మండలంలో టమోట జ్యూస్ పరిశ్రమలు ఏర్పాటు చేసి అక్కడి రైతులను ఆదుకోవాలన్నారు. జగ్గయ్యపేట, నందిగామ మండలాల పరిధిలో పేపర్ మిల్లు నెలకొల్పి అక్కడి సుబాబుల్ రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేయాలన్నారు. విజయవాడలో మురుగునీటి పారుదలకు అవుట్‌ఫాల్ డ్రైన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సింగ్‌నగర్ నుంచి చెత్త డంపింగ్ యార్డును తరలించి సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలన్నారు. ఆస్తిపన్ను విపరీతంగా పెంచి ప్రజలపై అదనపు భారం మోపారని విమర్శించారు. ఇంటి పన్ను, చెత్త పన్నులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని పేదల ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని, కొండచరియలు విరిగి పడకుండా మెష్‌లు, రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు చేసి కొంతప్రాంత ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతాలైన జగ్గయ్యపేట, కొండపల్లి, ఇబ్రహీం పట్నం ప్రాంతాల్లో కాలుష్య నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేసి బాధితులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను విస్తరించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సీపీఐ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్ మాట్లాడుతూ నూతన జిల్లాలు ఆవిర్భవించిన తరువాత భూపోరాటాల గడ్డ మైలవరంలో కామ్రేడ్ షేక్ సుభానీ వేదికపై ప్రథమ మహాసభ జరిగిందన్నారు. ఈ మహాసభలో 210 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. ఎ.కొండూరు మండలంలో కిడ్నీ బాధితుల సమస్యలు ఉద్దానం బాధితుల కంటే తీవ్రంగా ఉందని, దీని శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అక్టోబరులో విజయవాడలో జరగనున్న సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయటానికి యువజన, విద్యార్థి, మహిళా, కార్మిక సంఘాలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూమూ కృష్ణయ్య జి.కోటేశ్వరరావు పరుచూరి రాజేంద్ర పాల్గొన్నారు.

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గం:

జిల్లా కార్యదర్శిగా సీహెచ్.కోటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్, కార్యవర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, తూము కృష్ణయ్య, చుండూరు సుబ్బారావు, చిలకూరి వెంకటేశ్వరరావు, బుద్ది రమేష్, పరుచూరి రాజేంద్ర, ఇంటూరి నాగేశ్వర రావు, లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, పంచదార్ల దుర్గాంబ, బుట్టి రాయప్ప ఎన్నికయ్యారు. వీరితో పాటు ఆహ్వానితులుగా షేక్ నాగులు మీరా, లంకా గోవిందరాజులు (జూనియర్)ను ఎన్నుకున్నారు.

ఆహ్వానము
ప్రజాప్రదర్శన : ఆగస్టు 26 మధ్యాహ్నం 2 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుండి గురజాడ కళాక్షేత్రం వరకు
బహిరంగ సభ : గురజాడ కళాక్షేత్రం, సిరిపురం, సాయంత్రం 4 గంటలకు
సభాధ్యక్షులు : కామ్రేడ్ కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి
ముఖ్య అతిథి : కామ్రేడ్ డి.రాజా సీపీఐ ప్రధాన కార్యదర్శి
వక్తలు : కామ్రేడ్ డాక్టర్ కె.నారాయణ, జాతీయ సమితి కార్యదర్శి
కామ్రేడ్ అనీ రాజా, జాతీయ కార్యవర్గ సభ్యురాలు
కామ్రేడ్ మానం ఆంజనేయులు, అధ్యక్షులు, ఆహ్వాన సంఘం
కామ్రేడ్ ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి
కామ్రేడ్ జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి
CPI
విప్లవగీతాలాపన
సినీ సంగీత నేపథ్య గాయకులు
వందేమాతరం శ్రీనివాస్
అభివందనాలతో...
ఆహ్వాన సంఘం

విశాలాంధ్ర జాతీయ దినపత్రికకు 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
దారపు శ్రీనివాస్
గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి
పి. సుబ్బారెడ్డి
విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, కౌతవరం సబ్‌స్టేషన్
గుడ్లవల్లేరు మండల వి.ఆర్.ఓ.ల సంఘం
కామరవోలు వెంకటేశ్వరరావు (వెంకన్న) అధ్యక్షులు
ఎస్.వి.భాస్కరరావు, కార్యదర్శి
అంగలూరు గ్రామ పంచాయతి
మేడేపల్లి రవికుమార్, సర్పంచ్
త్రిపురనేని సురేష్, ఉపసర్పంచ్
వై.వి.ఎలీషారావు, కార్యదర్శి
కె.వి.ఎన్.శివాజి
గ్రామీణ తాగునీటి సరఫరాల విభాగం అసిస్టెంట్ ఇంజనీర్, గుడ్లవల్లేరు మండలం
లోయ సునీల్
గుడ్లవల్లేరు మండల వ్యవసాయ శాఖ అధికారి
వడ్లమన్నాడు గ్రామ పంచాయతి
కటికల జ్యోతిలత, సర్పంచ్
శాస్త్రి, కార్యదర్శి
కూరాడ గ్రామ పంచాయతి
కరీముల్లా, సచివాలయ కార్యదర్శి
చండిక ఉమా మహేశ్వరరావు ప్రత్యేక అధికారి

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.